**ప్రజలకు / పాఠకులకు ముఖ్య విజ్ఞప్తి**

"ప్రజాప్రశ్న" దినపత్రిక పేరు చెప్పుకొని ఎవరైనా డబ్బులు, విరాళాలు, ప్రకటనల పేరుతో నగదు లేదా ఇతర రూపంలో డిమాండ్ చేస్తే దయచేసి నమ్మవద్దు.

అలాంటి వ్యక్తుల వివరాలను వెంటనే మా దృష్టికి తీసుకురండి. ప్రజల ఫిర్యాదు అందిన వెంటనే సంబంధిత వ్యక్తులపై పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుంది.

- ప్రజాప్రశ్న యాజమాన్యం

PRAJA PRASHNA

# ప్రజాప్రశ్న

RNI : TELTEL/2021/80267

తెలుగు దినపత్రిక

సంపుటి: 6 సంచిక: 31, పేజీలు - 08

సోమవారం, జులై 27, 2026 వెల: 5 రూ/.

హైదరాబాద్ | ప్రజల పక్షాన ప్రశ్నించే పత్రిక | HYDERABAD




# గ్రేటర్ ఎన్నికలు ఎప్పుడు.?

**- గ్రేటర్ ఎన్నికల నిర్వహణ కాంగ్రెస్‌కు ఇష్టం లేదా.? - న్యాయపరమైన చిక్కుల్లో పడేలా ఎందుకు చేస్తున్నారు.?**




హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల సన్నాహాల్లో మునిగి తేలుతున్న అధికార కాంగ్రెస్ ప్రభుత్వానికి తెలంగాణ ఉన్నత న్యాయస్థానం ఊహించని షాక్ ఇచ్చింది. జీహెచ్‌ఎంసీ ఎన్నికల నోటిఫికేషన్ విడుదలపై హైకోర్టు తాత్కాలిక స్టే విధించడంతో అధికార వర్గాల్లో ఒక్కసారిగా కలకలం రేగింది. వార్డుల పునర్విభజన ప్రక్రియను చట్టబద్ధమైన నిబంధనల ప్రకారం పూర్తి చేసి, సరిహద్దులను శాస్త్రీయ పద్ధతిలో పునర్నిర్ణయించేంత వరకు ఎలాంటి ఎన్నికల ప్రక్రియను ముందుకు తీసుకెళ్లవద్దని రాష్ట్ర ప్రభుత్వంతో పాటు రాష్ట్ర ఎన్నికల సంఘాన్ని ధర్మాసనం కఠినంగా ఆదేశించింది. రాజధాని నగరంపై పట్టు సాధించాలని భావిస్తున్న హస్తం పార్టీకి ఈ న్యాయపరమైన చిక్కు అతిపెద్ద రాజకీయ ఎదురుదెబ్బగా మారింది.

### వార్డుల విభజనలో నిబంధనల ఉల్లంఘన

ఈ వివాదానికి ప్రధాన మూలం ఇటీవల జీహెచ్‌ఎంసీ ఆదరాబాదరాగా చేపట్టిన వార్డుల విభజన ప్రక్రియలోని అవకతవకలే. మున్సిపల్ చట్టాల ప్రకారం

2లో..

## విద్యార్థులపై ప్రాణాంతక దాడికి అనుమతిచ్చింది మీరు కాదా?

**- అమిత్ షాకు రాహుల్ గాంధీ ఘాటు లేఖ**



న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) దేశ రాజధాని ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద గత వారం విద్యార్థులపై జరిగిన పోలీసు దాడి ఘటనపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తీవ్రంగా స్పందించారు. విద్యార్థులపై జరిగిన ఈ "క్రూరమైన దాడి"కి పూర్తి బాధ్యత వహించాలని డిమాండ్ చేస్తూ ఆయన కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షాకు ఆదివారం ఒక లేఖ రాశారు. ఈ దాడిలో ప్రాణాంతకమైన పెల్లెట్ గన్లను ప్రయోగించడంపై ఆయన తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. వివరాల్లోకి వెళితే, జూలై 20న జంతర్ మంతర్ వద్ద "న్యాయమైన, జవాబుదారీతనంతో కూడిన విద్యా వ్యవస్థ"

2లో..

## తెలంగాణ అభివృద్ధిపై కేంద్రం దృష్టి పెట్టాలి

**- శాసనసభ, లోక్‌సభ ఎన్నికల వయోపరిమితి 21కి తగ్గించాలని రేవంత్ డిమాండ్**

**- 21 ఏళ్లకే ఐఏఎస్, మేయర్లు అవుతున్నప్పుడు ఎమ్మెల్యేలు ఎందుకు కాకూడదని ప్రశ్న**

**- ఆగస్టులో అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపుతామన్న సీఎం**



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** యువతను చట్టసభల్లోకి పెద్ద ఎత్తున తీసుకురావాలనే లక్ష్యంతో, శాసనసభ, లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసే కనీస వయోపరిమితిని 25 ఏళ్ల నుంచి 21 ఏళ్లకు తగ్గించాలని తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. 21 ఏళ్లకే యువత సివిల్ సర్వెంట్లుగా, మేయర్లుగా బాధ్యతలు చేపడుతున్నప్పుడు, వారికి చట్టసభల్లో పోటీ చేసే అవకాశం ఎందుకు ఇవ్వకూడదని ఆయన ప్రశ్నించారు. ఐఏఎన్ఎస్ వార్తా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో రేవంత్ రెడ్డి ఈ విషయాలు వెల్లడించారు. "21 ఏళ్లకే ఐఏఎస్, ఐపీఎస్ అధికారులుగా, జిల్లా పంచాయతీ చైర్‌పర్సన్‌లుగా నియమిస్తున్నాం. అలాంటప్పుడు అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో పోటీకి ఎందుకు అనుమతించకూడదు? దేశ జనాభాలో దాదాపు 30 శాతం ఉన్న 'జెన్-జీ' తరం గొంతుక చట్టసభల్లో వినిపించాలి.

2లో..

## మన యువశక్తిని చూసి గర్వపడుతున్నా

**- 'మన్ కీ బాత్'లో ప్రధాని మోదీ**



న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తన నెలవారీ రేడియో కార్యక్రమం 'మన్ కీ బాత్' 136వ ఎపిసోడ్‌లో దేశ యువత సాధిస్తున్న విజయాలపై ప్రశంసల వర్షం కురిపించారు. అంతరిక్షం నుంచి సైన్స్ ఒలింపియాడ్స్ వరకు వివిధ రంగాల్లో యువత అద్భుత ప్రతిభ కనబరుస్తోందని, దేశ యువశక్తిని చూసి తాను ఎంతో గర్వపడుతున్నానని అన్నారు. ఇటీవల విజయవంతమైన 'విక్రమ్-1' ప్రయోగం ప్రతి భారతీయుడి హృదయాన్ని గర్వంతో నింపిందని మోదీ పేర్కొన్నారు. ఇది వికసిత భారత్ లక్ష్యంలో ప్రైవేటు రంగం అభివృద్ధి చేసిన తొలి రాకెట్ అని, భారత అంతరిక్ష

2లో..

## 45 రోజుల పాటు డోర్ టు డోర్ ప్రచారం

**- ప్రభుత్వ విజయాలను, హామీల అమలును ప్రజలకు వివరించాలని నేతలకు చంద్రబాబు ఆదేశం**

**- స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని స్థానాలూ గెలవడమే లక్ష్యంగా పనిచేయాలని సూచన**

**- అనుచరులుగా కాదు, నాయకులుగా ఎదగాలని పార్టీ శ్రేణులకు పిలుపు**

**- గొడ్డలి పార్టీ విధ్వంసకర విధానాలను ప్రజల్లో ఎండగట్టాలని దిశానిర్దేశం**



**అమరావతి (ప్రశ్న న్యూస్)** ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వ రెండేళ్ల పాలనను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లేందుకు తెలుగుదేశం పార్టీ భారీ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. నేటి నుంచి 45 రోజుల పాటు రాష్ట్రవ్యాప్తంగా 'డోర్ టు డోర్' కార్యక్రమాన్ని నిర్వహించనుంది. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి, టీడీపీ అధినేత చంద్రబాబు పార్టీ ముఖ్యనేతలు, మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర ప్రజాప్రతినిధులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ బృహత్ కార్యక్రమంలో అనుసరించాల్సిన వ్యూహాలపై ఆయన పార్టీ శ్రేణులకు స్పష్టమైన దిశానిర్దేశం చేశారు. మంత్రుల నుంచి బూత్ స్థాయి కన్వీనర్ల వరకు పార్టీ యంత్రాంగం మొత్తం ఈ అవుట్ రీచ్ కార్యక్రమంలో పాల్గొనాలని ఆయన ఆదేశించారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ, గత ఎన్నికల్లో ప్రజలు కూటమికి చారిత్రాత్మక విజయాన్ని కట్టబెట్టారని గుర్తుచేశారు. "94 శాతం స్ట్రైక్ రేట్, 57 శాతం ఓట్లతో మనం గెలిచాం. నాటి ప్రభుత్వ విధ్వంసం,

2లో..

## విద్యాశాఖ మంత్రిగా రేవంత్ రెడ్డి రాజీనామా చేయాల్సిందే

**- తెలంగాణ బీజేపీ డిమాండ్**



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** తెలంగాణలో ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల చెల్లింపు వ్యవహారంపై కాంగ్రెస్ ప్రభుత్వం, బీజేపీ మధ్య మాటల యుద్ధం ముదిరింది. వారం రోజుల్లోగా పెండింగ్‌లో ఉన్న ఫీజు బకాయిలను విడుదల చేయాలని, లేనిపక్షంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విద్యాశాఖ మంత్రి పదవికి రాజీనామా చేయాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో సుమారు రూ. 12,000 కోట్ల ఫీజు బకాయిలను ప్రభుత్వం చెల్లించకపోవడంతో దాదాపు 20 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తు ప్రమాదంలో పడిందని ఆరోపించారు. నీట్ పేపర్ లీక్ ఘటనకు నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేసిన విషయాన్ని గుర్తుచేస్తూ "మేం మా చిత్తశుద్ధిని నిరూపించుకున్నాం, మీరు కూడా మీ చిత్తశుద్ధిని నిరూపించుకోవాలి" అని రేవంత్ రెడ్డిని ఉద్దేశించి వ్యాఖ్యానించారు. ఢిల్లీలో విద్యార్థులపై పోలీసుల దౌర్జన్యం జరిగిందంటూ ఇక్కడ ర్యాలీ తీసిన ముఖ్యమంత్రి, రాష్ట్రంలోని విద్యార్థుల సమస్యలను పట్టించుకోకపోవడం దారుణమని విమర్శించారు. మరోవైపు, బీజేపీ ఎంపీ డీకే అరుణ కూడా ఈ విషయంపై స్పందించారు.

2లో..

## ఇక ఎన్నికల్లో పోటీ చేయను

**- రాజకీయాలు అవినీతిమయం అయ్యాయన్న సిద్ధరామయ్య**



**బెంగుళూరు (ప్రశ్న న్యూస్)** కర్ణాటక మాజీ సీఎం సిద్ధరామయ్య సంచలన ప్రకటన చేశారు. తాను 2028 అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేయబోనని, ఎన్నికల రాజకీయాల నుంచి శాశ్వతంగా వైదొలుగుతున్నానని స్పష్టం చేశారు. అయితే,

2లో..

## ఆసుపత్రి బెడ్‌పై వైఎస్ షర్మిల

**- సర్జరీపై స్పష్టతనిచ్చిన ఏపీ కాంగ్రెస్ చీఫ్**



**అమరావతి (ప్రశ్న న్యూస్)** ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (ఏపీసీసీ) అధ్యక్షురాలు వైఎస్ షర్మిల శస్త్రచికిత్స చేయించుకున్నారు. ఆసుపత్రి బెడ్‌పై చికిత్స పొందుతున్న ఆమె ఫొటో ఒకటి సోషల్ మీడియాలో వైరల్ కావడంతో ఆమె ఆరోగ్య పరిస్థితిపై పార్టీ శ్రేణుల్లో, ప్రజల్లో ఆందోళన వ్యక్తమైంది. ఈ ఊహాగానాలకు తెరదించుతూ, తన ఆరోగ్య పరిస్థితిపై షర్మిల స్వయంగా 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా స్పష్టత ఇచ్చారు. తనకు పొత్తికడుపుకు సంబంధించిన ఒక సాధారణ ఆపరేషన్ జరిగిందని, ప్రస్తుతం వేగంగా కోలుకుంటున్నానని తెలిపారు. ఈ మేరకు ఆమె ఒక పోస్ట్ చేస్తూ "ఇటీవల నాకు పొత్తికడుపు ఆపరేషన్ జరిగింది. ప్రస్తుతం నేను బాగున్నాను, చాలా వేగంగా కోలుకుంటున్నాను. ఈ విషయాన్ని మీ అందరితో పంచుకోవడం ఎంతో సంతోషంగా ఉంది. ఈ సమయంలో నా కోసం ప్రార్థనలు చేసిన వారికి, ధైర్యం చెప్పిన ప్రతి ఒక్కరికీ హృదయపూర్వక ధన్యవాదాలు. మీ ప్రేమ, ఆదరణ, ఆశీస్సులు నాకు ఎంతో బలాన్నిచ్చాయి" అని పేర్కొన్నారు. ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఆమె భరోసా ఇచ్చారు. ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలిగా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి షర్మిల రాష్ట్ర రాజకీయాల్లో చాలా చురుగ్గా

2లో..

## పరీక్షల సంస్కరణలకు టాస్క్‌ఫోర్స్

**- నందన్ నిలేకని నేతృత్వంలో హైపవర్ టాస్క్‌ఫోర్స్**



**న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్)** దేశవ్యాప్తంగా తీవ్ర చర్చకు దారితీసిన నీట్ ప్రశ్నపత్రం లీక్ వివాదం నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం పరీక్షల వ్యవస్థలో సమగ్ర సంస్కరణలకు శ్రీకారం చుట్టింది. ఇప్పటికే ఈ పేపర్ లీక్‌లకు బాధ్యత వహిస్తూ

2లో..

## లాస్ట్ డేట్ అని మోసం చేస్తారు.. జాగ్రత్త

**- ఇందిరమ్మ టవర్స్ కోసం స్పెషల్ హెల్ప్‌లైన్ నెంబర్**

**- మోసాలపై ప్రజల్ని అప్రమత్తం చేసిన సజ్జనార్**



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపు పేరుతో హైదరాబాద్‌లో సైబర్ నేరాలు జరుగుతున్నాయని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని నగర సీపీ సజ్జనార్ హెచ్చరించారు. రూ. 10,000 ఈఎండీ

2లో..

## కామన్వెల్త్ క్రీడల్లో భారత్‌కు తొలి స్వర్ణం

**- మీరాబాయి చాను చారిత్రాత్మక 'గోల్డెన్ హ్యాట్రిక్'**




న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) కామన్వెల్త్ గేమ్స్ 2026లో భారత క్రీడాకారులు తమ సత్తాను ఘనంగా చాటుకున్నారు. భారత వెయిట్‌లిఫ్టింగ్ చరిత్రలో మరో స్వర్ణాధ్యాయాన్ని లిఖిస్తూ స్టార్ లిఫ్టర్, ఒలింపిక్ పతక విజేత మీరాబాయి చాను మహిళల 48 కేజీల విభాగంలో పసిడి పతకాన్ని ముద్దాడింది. ఆదివారం జరిగిన ఈ పోటీలో అద్వితీయ ప్రదర్శన కనబరిచిన ఆమె, వరుసగా

2లో..

# పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు దారుల పరిస్థితి అయోమయం

- కేసు పెట్టిన ఫిర్యాదు దారులనే అడిగిన ప్రశ్నలు పదేపదే అడుగుతూ
- ఫిర్యాదారులనే ఇబ్బందులకు గురి చేస్తున్నారంటూ బాధితుల ఆవేదన
- పేట్ బషీర్ బాద్ పోలీస్ స్టేషన్ లో బాధితులకు న్యాయం జరిగేనా.?
- నగరంలో చాలా పోలీస్ స్టేషన్లలో ఫిర్యాదారుల పరిస్థితి అయోమయం
- న్యాయం కోసం ఫిర్యాదు చేస్తే న్యాయం జరుగుతుందని గ్యారంటీ ఉందా.?
- రాజకీయ, ఆర్థిక బలం ఉన్నవాడిదే రాజ్యం అన్నట్లుగా మారుతుంది పరిస్థితి
- కేసు నంబర్ 811, తేదీ 8-6-2026లో మొత్తం 9 మంది నిందితులు ఉన్నారని చెబుతున్నప్పటికీ.. ఇద్దరికే నోటీసులు ఎందుకు ఇచ్చారు?
- మిగిలిన 7 మంది నిందితులు మూడు వారాలుగా అందుబాటులో ఉన్నా వారికి నోటీసులు ఎందుకు ఇవ్వలేదు?
- నిందితులు పోలీసుల పరిధిలో ఉన్నప్పటికీ నోటీసులు ఇవ్వడంలో ఇంత ఆలస్యం ఎందుకు?
- కేసు విచారణలో దర్యాప్తు అధికారులు ఎందుకు కాలయాపన చేస్తున్నారన్న ఆరోపణలకు సమాధానం ఏమిటి?
- కేసును ఆలస్యం చేయడం వెనుక ఏమైనా కారణాలు ఉన్నాయా?
- కేసును నీరుగార్చేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయన్న అనుమానాలపై అధికారులు ఎందుకు స్పందించడం లేదు?
- కీలక సాక్షిని బెదిరిస్తున్నారని వచ్చిన ఆరోపణలపై పోలీస్ శాఖ ఏ చర్యలు తీసుకుంది?
- కేసుతో సంబంధం లేని వ్యక్తి సాక్షిని బెదిరిస్తున్నాడన్న ఆరోపణలు నిజమైతే అతనిపై చర్యలు ఎందుకు లేవు?
- బాధితులు, సాక్షులకు రక్షణ కల్పించాల్సిన బాధ్యత పోలీస్ శాఖకు లేదా?
- నిందితులందరిపై సమానంగా చట్టం అమలు చేస్తున్నారా? లేక కొందరికి ప్రత్యేక మినహాయించట్టం



హైదరాబాద్(ప్రశ్న న్యూస్) పేట్ బషీర్ బాద్ పోలీస్ స్టేషన్లో న్యాయం కోసం పోలీసులను ఆశ్రయించిన బాధితులకు వేగవంతమైన దర్యాప్తు, నిష్పక్షపాత విచారణ అందాల్సి ఉండగా పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన కేసు నంబర్ 811, తేదీ 8-6-2026 విషయంలో జరుగుతున్న పరిణామాలు పలు అనుమానాలకు తావిస్తున్నాయని బాధిత వర్గాలు ఆరోపిస్తున్నాయి. భారతీయ న్యాయ సంహిత సెక్షన్ 85 కింద నమోదైన ఈ కేసులో మొత్తం తొమ్మిది మంది నిందితులు ఉన్నప్పటికీ, ఇప్పటివరకు కేవలం ఇద్దరికే నోటీసులు ఇచ్చినట్లు సమాచారం. మిగిలిన నిందితులు కేసు నమోదు అయిన తర్వాత మూడు వారాలుగా అందుబాటులో ఉన్నప్పటికీ వారికి నోటీసులు ఎందుకు ఇవ్వలేదన్న ప్రశ్నలు ఇప్పుడు తీవ్రంగా వినిపిస్తున్నాయి.కేసు నమోదై రోజులు గడుస్తున్నా దర్యాప్తు ముందుకు సాగకపోవడం, నిందితులందరిపై ఒకే విధమైన చట్టపరమైన చర్యలు తీసుకోకపోవడం, కొందరికి మాత్రమే నోటీసులు ఇచ్చి మిగిలిన వారిని ఎందుకు వదిలేశారన్న అంశం చర్చనీయాంశంగా మారింది. నిందితులు పోలీసులకు అందుబాటులో ఉన్నప్పటికీ నోటీసులు ఇవ్వకుండా కాలయాపన చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. దర్యాప్తులో ఆలస్యం జరిగితే సాక్ష్యాలు ప్రభావితం కావచ్చని, సాక్షులను ప్రభావితం చేసే అవకాశం ఉందని బాధిత వర్గాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి.తొమ్మిది మందిలో ఇద్దరికే నోటీసులా..?కేసులో మొత్తం తొమ్మిది మంది నిందితులు ఉన్నట్లు బాధిత వర్గాలు చెబుతున్నాయి. అయితే వారిలో కేవలం ఇద్దరికే నోటీసులు ఇచ్చి, మిగిలిన ఏడుగురిపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం వెనుక కారణమేంటని ప్రశ్నిస్తున్నారు. నిందితులందరికీ చట్టం సమానంగా వర్తించాల్సి ఉండగా, కొందరిపై చర్యలు.. మరికొందరిపై మౌనం ఎందుకు అన్నది పోలీస్ శాఖ సమాధానం చెప్పాల్సిన ప్రశ్నగా మారింది.నిందితులు మూడు వారాలుగా అందుబాటులో ఉన్నారని బాధితులు చెబుతున్న నేపథ్యంలో, వారిని విచారించేందుకు లేదా చట్టపరమైన నోటీసులు ఇవ్వడానికి ఇంత కాలయాపన ఎందుకు జరిగిందని ప్రశ్నిస్తున్నారు. దర్యాప్తు అధికారులు కేసు పురోగతిపై బాధితులకు స్పష్టమైన సమాచారం ఇవ్వకపోవడం కూడా అనుమానాలకు కారణమవుతోందని వారు అంటున్నారు. కేసులో కీలక సాక్షిని బెదిరిస్తున్నారని కూడా ఆరోపణలు వినిపిస్తున్నాయి. సాక్షిని భయపెట్టి కేసు నుంచి వెనక్కి తగ్గించే ప్రయత్నాలు



FIRST INFORMATION REPORT | T.S.P.M. Orders 470,500
(Under section 173 and 176 BNSS)
1. District Cyberabad | P.S. Petbasheerabad | Year 2026 | FIR No. 811/2026 Date 08-06-2026
2. Acts & Section(s): 85 BNS
3. a) Occurrence of Offence: Day Monday | Date & Time From
Date & Time To | Prior To 08-06-2026 00:00:00 | Time Period
b) Information Received at P.S.: Date & Time 08-06-2026 19:00
General Diary Reference: Entry No 3 | Date & Time 08-06-2026 19:00
4. Type of Information: Written
5. Place of Occurrence:
a) Distance and Direction From P.S.: 6 Kms. North | Beat No. Devender Colony, Kompally
b) Address Place Devender Colony, Kompally | Area/Mandal Gandimaisamma-Dundigal | Street/Village Kompally
City/District MEDCHAL MALKAJGIRI | State Telangana | PIN
c) In case, outside the limit of this Police Station, then
Name of P.S. | District
6. Complainant / Informant:
a) Name G.Raja Rani
b) Father's /Husband's Name Rajesh Kumar Bantu
c) Date/Year of Birth | Age 45 Years
d) Nationality India | e) Caste Others
f) Passport No | Date of Issue | Place of Issue
g) Occupation Housewife | Mobile No. 9553440995
h) Address House No Flat No A-502, Dellis Fortune | Area/Mandal Gandimaisamma Dundigal | Street/Village Kompally
City/District MEDCHAL MALKAJGIRI | State TELANGANA | PIN
7. Details of known/suspected/unknown accused with full particulars:
Serial No: 1
a) Name Pushpa Bantu
b) Father's /Husband's Name
c) Occupation | d) Caste | e) Gender Female
f) Age | Nationality India
g) Address
House No | Street/Village | Area/Mandal

జరుగుతున్నాయనే ఫిర్యాదులు ఉన్నప్పటికీ, పోలీస్ శాఖ అధికారులు దీనిపై తగిన చర్యలు తీసుకోకపోవడం ఏమిటని బాధిత వర్గాలు ప్రశ్నిస్తున్నాయి.సాక్షిని బెదిరిస్తున్న వ్యక్తి కేసుతో ప్రత్యక్ష సంబంధం లేని వ్యక్తి అని చెబుతున్నప్పటికీ, అతనిపై ఫిర్యాదులు వచ్చినా పోలీసులు ఎందుకు స్పందించలేదన్నది మరో ప్రశ్న. ఒకవైపు కేసు విచారణలో జాప్యం, మరోవైపు సాక్షులను బెదిరిస్తున్నారన్న ఆరోపణలు.. ఇవన్నీ కలిపి చూస్తే దర్యాప్తు ప్రక్రియపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయని బాధితులు పేర్కొంటున్నారు.

### కేసును నీరుగార్చే ప్రయత్నమా..?

కేసు నమోదైన తర్వాత పోలీసులు వేగంగా దర్యాప్తు పూర్తి చేసి, అందుబాటులో ఉన్న నిందితులను విచారించి, సాక్ష్యాలను సేకరించాల్సి ఉంటుంది. కానీ కేసులో నిందితులందరూ అందుబాటులో ఉన్నప్పటికీ నోటీసులు ఇవ్వడంలో జాప్యం ఎందుకు జరుగుతోందన్నది అర్థంకాని విషయంగా మారింది. ఒకవైపు నిందితులకు అనుకూలంగా సమయం లభిస్తుండగా, మరోవైపు బాధితులు, సాక్షులు ఒత్తిడికి గురయ్యే పరిస్థితులు ఏర్పడితే దర్యాప్తు నిష్పక్షపాతంగా సాగుతుందా అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి.కేసు విచారణను కావాలనే ఆలస్యం చేస్తున్నారా..? కొందరికి మాత్రమే ప్రయోజనం కల్పించేలా వ్యవహరిస్తున్నారా..? లేక దర్యాప్తు ప్రక్రియలో ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపించిందా..? అనే అనుమానాలు బాధిత వర్గాల్లో వ్యక్తమవుతున్నాయి. ఈ ఆరోపణలపై పేట్ బషీరాబాద్ పోలీస్ అధికారులు స్పష్టమైన వివరణ ఇవ్వాల్సిన అవసరం ఉందని స్థానికులు అంటున్నారు.

### ఉన్నతాధికారులు స్పందించాలి

కేసు నంబర్ 811 విషయంలో ఇప్పటివరకు తీసుకున్న చర్యలు ఏమిటి..? మొత్తం తొమ్మిది మంది నిందితుల్లో ఇద్దరికే నోటీసులు ఎందుకు ఇచ్చారు..? మిగిలిన నిందితులకు నోటీసులు ఎప్పుడు ఇస్తారు..? వారు పోలీసులకు అందుబాటులో ఉన్నప్పటికీ ఎందుకు ఆలస్యం జరిగింది..? సాక్షిని బెదిరిస్తున్నారని వచ్చిన ఆరోపణలపై ఏం చర్యలు తీసుకున్నారు..? కేసుతో సంబంధం లేని వ్యక్తి జోక్యంపై ఎందుకు స్పందించలేదు..?

అన్న ప్రశ్నలకు పోలీస్ శాఖ సమాధానం చెప్పాలని బాధిత వర్గాలు డిమాండ్ చేస్తున్నాయి.పోలీస్ శాఖపై ప్రజలకు నమ్మకం ఉండాలంటే ప్రతి కేసులోనూ పారదర్శకత, సమానత్వం, వేగవంతమైన దర్యాప్తు అవసరం. ఒక కేసులో కొందరిపై మాత్రమే చర్యలు తీసుకుని, మిగిలిన వారిపై కాలయాపన జరిగితే ప్రజల్లో అనుమానాలు రావడం సహజం. ముఖ్యంగా సాక్షులను బెదిరిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నప్పుడు అధికారులు మరింత అప్రమత్తంగా వ్యవహరించాల్సి ఉంటుంది.కేసు విచారణలో జరుగుతున్న జాప్యంపై ఉన్నతాధికారులు వెంటనే దృష్టి సారించి, పూర్తి వివరాలతో దర్యాప్తు పురోగతిని పరిశీలించాలని బాధితులు కోరుతున్నారు. కేసును కాలయాపన చేయకుండా, నిందితులందరిపై చట్ట ప్రకారం సమాన చర్యలు తీసుకుని, సాక్షులకు రక్షణ కల్పించి, విచారణను నిష్పక్షపాతంగా పూర్తి చేయాలని వారు డిమాండ్ చేస్తున్నారు. స్టేషన్ హౌస్ ఆఫీసర్ విజయవర్ధన్ వివరణ: కేసును దర్యాప్తు చేస్తున్నాము ఇంక విచారణ జరుగుతుంది అని తెలిపారు. ఏసిపి బాల గంగిరెడ్డి వివరణ: దర్యాప్తు చేస్తున్నాము విచారణ జరుగుతుంది అని తెలిపారు.

# ఒక రాజీనామా.. ఆరు రాజకీయ పాఠాలు

## - ప్రభుత్వాన్ని కదిలించిన యువత ఉద్యమం



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా ఇది కేవలం ఒక మంత్రి పదవి నుంచి వైదొలగడం కాదు. అజేయమని భావించే ప్రభుత్వానికి, రాజకీయాలపై ఆసక్తి లేదనుకునే యువతరం రుచి చూపించిన ఓ రాజకీయ గుణపాఠం. నాయకుడు లేని ఈ నిరసన, డిజిటల్ యుగపు రాజకీయాలకు సరికొత్త భాష్యం చెప్పింది. దేశవ్యాప్తంగా లక్షలమంది విద్యార్థుల భవిష్యత్తును ప్రశ్నార్థకం చేసిన 'నీట్' సంక్షోభం చివరకు కేంద్రంలో తొలి వికెట్‌ను పడగొట్టింది. ఈ పరిణామం నుంచి పాలకులు, రాజకీయ పార్టీలు నేర్చుకోవాల్సిన కీలక పాఠాలు ఇవి.

### - యువశక్తిని తక్కువ అంచనా వేయొద్దు

రాజకీయాలపై ఆసక్తి లేని 'జెన్-జీ' తరం అని ముద్ర వేయబడిన యువత, తమ భవిష్యత్తుకు సంబంధించిన అంశంపై ఎంత తీవ్రంగా స్పందిస్తారో ఈ ఉద్యమం కళ్లకు కట్టింది. వారు రోడ్లపైకి రాలేదు, ధర్నాలు చేయలేదు. కానీ తమ చేతిలోని స్మార్ట్‌ఫోన్‌నే ఆయుధంగా చేసుకొని ప్రభుత్వాన్ని గడగడలాడించారు. యువత ఆకాంక్షలను విస్మరిస్తే, వారి ఆగ్రహం పెను తుఫానుగా మారుతుందని ఇది నిరూపించింది.

### - డిజిటల్ యుగపు ఆయుధం - సోషల్ మీడియా

ఈ ఉద్యమానికి ఒక నిర్దిష్టమైన నాయకుడు లేడు, పార్టీ లేదు. ఇన్‌స్టాగ్రామ్ రీల్స్, యూట్యూబ్ షార్ట్స్, ట్విట్టర్ హ్యాష్‌ట్యాగ్‌లు, వాట్సాప్ గ్రూపులే ఈ ఉద్యమానికి వేదికలయ్యాయి. మీమ్స్ చురకత్తుల్లా, వీడియోలు నిప్పుకణాల్లా వ్యాపించి, దేశవ్యాప్తంగా విద్యార్థులను, తల్లిదండ్రులను ఏకతాటిపైకి తెచ్చాయి. ప్రభుత్వాలు నియంత్రించలేని ఈ డిజిటల్ శక్తిని తట్టుకోవడం ఎంత కష్టమో ఈ ఘటన రుజువు చేసింది.

### - నాయకుడు లేని ఉద్యమం - కొత్త వ్యూహం

ఒక నాయకుడు ఉంటే, అతడిని లక్ష్యంగా చేసుకొని ఉద్యమాన్ని నీరుగార్చడం పాలకులకు తెలిసిన విద్య. కానీ, ఈ ఉద్యమంలో ప్రతి విద్యార్థి నాయకుడే. లక్షలాది గొంతుకలు ఒకేసారి మాట్లాడాయి. దీనివల్ల ప్రభు వర్గాలు ఎవరితో చర్చించాలో, ఎవరిని బుజ్జగించాలో తెలియక అయోమయానికి గురయ్యాయి. నాయకుడు లేకపోవడమే ఈ ఉద్యమానికి అతిపెద్ద బలమైంది.

### - విద్యా సంక్షోభం - బలమైన రాజకీయ అస్త్రం


మతం, కులం వంటి భావోద్వేగ అంశాలు రాజకీయాలను శాసిస్తున్న తరుణంలో, విద్య, ఉపాధి వంటి మౌలిక సమస్యలు ఎంతటి శక్తివంతమైన రాజకీయ అస్త్రాలుగా మారగలవో ఈ ఉద్యమం చూపించింది. తమ పిల్లల భవిష్యత్తు కోసం ప్రతి కుటుంబం పడుతున్న ఆవేదన, ఈ నిరసనకు నైతిక బలాన్ని ఇచ్చింది. ఈ అంశం ఓటు బ్యాంకు రాజకీయాలను సైతం ప్రభావితం చేయగలదని తేలిపోయింది.

### - జవాబుదారీతనం

"పరీక్షల్లో అవకతవకలు సహజం, ఒకటి రెండు సంఘటనలకే రాద్ధాంతం ఎందుకు?" అనే ప్రభుత్వ నిర్లక్ష్య ధోరణి ఈసారి పనిచేయలేదు. సమస్యను అంగీకరించి, బాధ్యులపై చర్యలు తీసుకునే వరకు వెనక్కి తగ్గేది లేదని యువతరం స్పష్టం చేసింది. మంత్రి రాజీనామా, ప్రభుత్వంలో జవాబుదారీతనం సాధ్యమేనన్న నమ్మకాన్ని యువతలో నింపింది. ఇది ప్రజాస్వామ్యానికి గొప్ప విజయం.

### - ప్రత్యామ్నాయ మీడియా ప్రభంజనం

ప్రధాన స్రవంతి మీడియా తొలుత ఈ అంశానికి ఇవ్వాల్సినంత ప్రాధాన్యత ఇవ్వకపోయినా, సోషల్ మీడియా, యూట్యూబ్ ఛానెళ్లు, డిజిటల్ న్యూస్ ప్లాట్‌ఫామ్‌లు ఈ ఉద్యమాన్ని భుజానకెత్తుకున్నాయి. వాస్తవాలను, విద్యార్థుల ఆవేదనను



నేరుగా ప్రజల్లోకి తీసుకెళ్లాయి. ప్రభుత్వాలు ఇకపై మీడియాను మేనేజ్ చేసి తమకు అనుకూలంగా వార్తలు రాయించుకునే రోజులు పోయాయని ఈ పరిణామం హెచ్చరించింది. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాతో విద్యా వ్యవస్థలోని సమస్యలన్నీ పరిష్కారమైపోవు. కానీ, ఇది ఒక కీలకమైన కనువిప్పు. యువతరం గళం విప్పితే, ప్రభుత్వాలు తలొగ్గక తప్పదని చెప్పడానికి ఇదొక నిదర్శనం. ఈ ఆరు పాఠాలు రాబోయే రోజుల్లో భారత రాజకీయాలపై తప్పకుండా ప్రభావం చూపుతాయి.

## రోడ్డుపై విగత జీవిగా చిరుతపులి..

# అధికారుల దర్యాప్తు



మెదక్ అర్బన్, జులై 26 : మెదక్- రామాయంపేట్ రోడ్డుపై చిరుతపులి విగత జీవిగా పడి ఉంది. ఆదివారం ఉదయం 10: 30 గంటల ప్రాంతంలో హవేలి ఘనాపూర్ మండలంలోని గంగాపూర్ రాజేశ్వర్ స్వామి దేవాలయం సమీపంలో చిరుతపులి రక్తపు మడుగులో ప్రాణాలు విడిచింది. అటవీశాఖ అధికారులు ఘటనా స్థలానికి చేరుకుని చిరుతపులిని పరిశీలించారు.గంగాపూర్ సమీపంలో అడవి ప్రాంతం ఉండడంతో అక్కడ సంచరిస్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో చిరుతపులి మృతి చెందినట్లు ఈ ప్రమాదం జరిగిందని అటవీశాఖ అధికారులు భావిస్తున్నారు. కాగా చిరుత పులి మృతిపై అటవీశాఖ అధికారులు పూర్తిస్థాయిలో దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

## కోలుకుంటున్న మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి



వరంగల్ : గుండెపోటుకు గురైన నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి వేగంగా కోలుకుంటున్నారు. ఈ మేరకు హనుమకొండలోని రోహిణి హాస్పిటల్ డైరెక్టర్ డా. సుధాకర్ రెడ్డి పెద్ది హెల్త్ బులెటిన్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. సుదర్శన్ రెడ్డి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందన్నారు. హార్ట్ స్ట్రోక్‌తో హాస్పిటల్‌కు తీసుకురావడంతో చికిత్స మొదలు పెట్టామని తెలిపారు. లంగ్స్ ఇన్ఫెక్షన్ ఉన్నట్లు గుర్తించామని, ప్రాథమిక చికిత్స అనంతరం హైదరాబాద్‌లోని యశోద హాస్పిటల్‌కు తరలించే ఏర్పాట్లు చేస్తున్నాం. సోషల్ మీడియాలో వచ్చే వదంతులు నమ్మొద్దని సూచించారు.

## భారీ ఓషన్ సన్‌ఫిష్‌ను ఢీకొట్టి ముక్కలు చేసిన కిల్లర్ వేల్..



సముద్ర జీవుల్లో అత్యంత తెలివైనవిగా పేరున్న కిల్లర్ వేల్స్ కు సంబంధించిన ఓ అద్భుత దృశ్యం కెమెరాకు చిక్కింది. మెక్సికో లోని గల్ఫ్ ఆఫ్ కాలిఫోర్నియా లో ఓ భారీ ఓషన్ సన్‌ఫిష్‌ను ఒక ఓర్కా అత్యంత వేగంగా ఢీకొట్టి వేల ముక్కలుగా పేల్చివేసింది. ఈ అసాధారణ వేట పద్ధతిని సముద్ర జీవశాస్త్రవేత్తలు తొలిసారిగా వీడియోలో బంధించారు. 'బినీత్ ది వేవ్స్' అనే సంస్థకు చెందిన మెరైన్ బయాలజిస్ట్ డాక్టర్ క్యాథరిన్ ఐర్స్ ఈ అరుదైన ఫుటేజ్‌ను రికార్డ్ చేశారు. ఇందులో ఒక ఆడ ఓర్కా చనిపోయిన సన్‌ఫిష్ తోకను పట్టుకుని ఉండగా, మరో మగ ఓర్కా దానివైపు అత్యంత వేగంగా దూసుకువచ్చింది. ఢీకొట్టడానికి కొద్ది క్షణాల ముందు ఆడ ఓర్కా సన్‌ఫిష్‌ను వదిలేయగా.. మగ ఓర్కా దాన్ని బలంగా ఢీకొట్టింది. ఈ తాకిడికి ఆ భారీ చేప వేల ముక్కలుగా చిన్నాభిన్నమైంది. అనంతరం ఆ ముక్కలను ఓర్కా గుంపులోని చేపలన్నీ సులభంగా పంచుకు తిన్నాయి. ఓ చిన్న ఓర్కా కూడా ఈ ముక్కలను తినడం కనిపించింది. ఓషన్ సన్‌ఫిష్ (మోలా మోలా) దాదాపు 2000 కిలోల బరువు వరకు పెరుగుతుంది.ఇంత పెద్ద చేపను ముక్కలు చేయడం కష్టం కాబట్టి.. ఓర్కాలు ఈ వ్యూహాన్ని అనుసరిస్తున్నాయని శాస్త్రవేత్తలు భావిస్తున్నారు. 2025 సెప్టెంబర్‌లో కూడా ఇదే ప్రాంతంలో ఇలాంటి సంఘటనే రికార్డయింది. ఈ వరుస ఘటనలు ఓర్కాల సమస్య పరిష్కార సామర్థ్యాలను, సామాజిక సమన్వయంతో వేటాడే నైపుణ్యాలను తెలియజేస్తున్నాయని పరిశోధకులు చెబుతున్నారు.

## మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డికి తీవ్ర అస్వస్థత..

### వరంగల్ బయలు దేరిన కేటీఆర్



నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డికి తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. కుటుంబ సభ్యులు ఆయనను వెంటనే వరంగల్‌లోని ఓ హాస్పిటల్‌కు తరలించి చికిత్స అందిస్తున్నారు. విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హుటాహుటిన వరంగల్ బయల్దేరి వెళ్లారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## జూరాలకు ప్రారంభమైన వరద ప్రవాహం



జూరాల ప్రాజెక్ట్‌కు వరద ప్రవాహం మొదలైంది. నారాయణపూర్ డ్యాం నుంచి దిగువకు కృష్ణ జలాలు వదలడంతో వరద నీరు ఆదివారం జూరాల ప్రాజెక్టులో కలిశాయి. ప్రస్తుతం జూరాలకు 3,227 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతోంది. ఈ ప్రవాహం ఇలాగే కొనసాగితే జూరాల పూర్తి స్థాయి నీటి మట్టానికి చేరుకుంటుంది. జూరాల పూర్తి స్థాయి నీటిమట్టం 318.516 మీటర్లు కాగా ప్రస్తుతం 316.09 మీటర్లుగా ఉన్నది. పూర్తి స్థాయి నీటి నిల్వ 9.657 టీఎంసీలకు గాను ప్రస్తుత నీటి నిల్వ 5.318 టీఎంసీలు ఉన్నది.

# వర్షాల కోసం వనభోజనాలు



ఏటూరు నాగారం(ప్రశ్న న్యూస్) మండలంలో వర్షాలు కురవాలని కోరుతూ పద్మశాలి కులస్తులు ఆదివారం జీడి వాగు అటవీ ప్రాంతంలో వనభోజనాలు నిర్వహించారు. ప్రకృతి దేవతలు, చెట్ల అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేసి కొబ్బరికాయలు కొట్టారు. అమ్మవారికి కోళ్లను బలి ఇచ్చి సామూహిక ప్రార్థనలు చేశారు. సకాలంలో వర్షాలు కురిసి పంటలు పండాలని కోరారు. కార్యక్రమంలో పోగుల లక్ష్మీనారాయణ, అలవాల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ తెలుగు విశేష ప్రతిభాపురస్కారంకు

# డా. వాసరవేణి పర్శరాములు ఎంపిక



ఎల్లారెడ్డిపేట (ప్రశ్న న్యూస్) తెలుగుభాషా సాహిత్యానికి కృషి చేస్తున్నందుకుగాను, అదేవిధంగా బాలసాహిత్యంలో రచనా, పరిశోధన చేసినందుకుగాను డా. వాసరవేణి పర్శరాములు గారు "జాతీయ తెలుగు విశేష ప్రతిభా పురస్కారం"కు ఎంపికైనట్లు తెలంగాణ వివేక రచయితల సంఘం జిల్లా కార్యదర్శి దుంపెన రమేష్ తెలిపారు. ఈసందర్భంగా తెవిరసం జిల్లా కార్యదర్శి దుంపెన రమేష్ మాట్లాడుతూ డా. వాసరవేణి పర్శరాములు తెలుగు సాహిత్యంలో ఎనలేని కృషి చేశారనీ, చుక్ చుక్ రైలు, చల్ చల్ గుర్రం, చిర్రగోనె, చెట్టిరుక, నారుమడి, మట్టిలో మాణిక్యం, చైతన్యమూర్తి, బతుకమ్మ, గొర్రెపిల్ల, పరశురామ బాలశతకం , నాన్న చెప్పిన కథలు, జానపద పిల్లల పాటలు, తంగెడు చెట్టు, దశాబ్ది బాలసాహిత్యం ఒక పరిశీలన, తెలంగాణ వ్యావహారికభాషా పదాలు, ఆకుఅలం, కర్రెద్దు, తెలంగాణ దీర్ఘ గేయ కవిత, ఓ స్వార్థ రాజకీయ నాయకుల్లారా!, మూఢ నమ్మకాలు, మొదలగు 20కి పైగా పుస్తకాలు రచించారనీ, బాలసాహిత్యంలో పరిశోధన చేసి ఉస్మానియా విశ్వవిద్యాలయం నుండి డాక్టరేట్ పట్టా పొందారన్నారు. వీరి రచనలు ఇతర భాషల్లోని కి అనువాదం అయ్యాయనీ, అధ్యాపకుడిగా బోధన చేస్తున్నారనీ, 500లకు పైగా వ్యాసాలు రాయగా వివిధ పత్రికల్లో ప్రచురితమయ్యాయనీ తెలిపారు. తెలుగుభాషను బోధిస్తూ ఎందరో విద్యార్థులను తీర్చిదిద్దుతున్నారనీ, తెలుగు భాషా సాహిత్యంలో కృషికిగాను జాతీయ తెలుగు సారస్వత పరిషత్తు ఆధ్వర్యంలో జూలై 28 మంగళవారం సాయంత్రం న్యూఢిల్లీలో అందజేస్తున్నట్లు, పలువురు కేంద్ర మంత్రులు పాల్గొంటారని అధ్యక్షుడు కేశరాజు రాంప్రసాద్ ప్రకటించారనీ దుంపెన రమేష్ తెలిపారు. తెవిరసం రచయితలు జనపాల శంకరయ్య , తెలుగు పండితులు చెరుకు మహేశ్వరశర్మ, కామని లక్ష్మయ్య, దుంపెన రమేష్, శివాల భక్తర్, ఇ. మహేందర్, బారా ధన్ రాజ్, గుండెల్లి నీలకంఠం , వాసరవేణి దేవరాజు, వై.రాజు జి. తిరుపతి, తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

# హెున్నాజిపేట రైతు వేదికలో ఐడి పంటలు, కూరగాయల విత్తనాల మేళా





ధర్పల్లి (ప్రశ్న న్యూస్) నిజామాబాద్ జిల్లా ధర్పల్లి మండలంలోని రైతులకు నాణ్యమైన విత్తనాలు అందుబాటులో ఉంచే ఉద్దేశంతో జూలై 27 నుండి 29 వరకు హెున్నాజిపేట రైతు వేదికలో విత్తనాల మేళా నిర్వహించబడుతుందని ఈ విత్తనాల మేళాలో మొక్కజొన్న, కందులు పెసలు మినుములు తో పాటు వివిధ రకాల కూరగాయల పంటల విత్తనాలు రైతులకు అందుబాటులో ఉంటాయని మండల వ్యవసాయ అధికారి తెలిపారు.రైతులు తమ అవసరాలకు అనుగుణంగా నాణ్యమైన, ధృవీకరించబడిన విత్తనాలను కొనుగోలు చేసుకొని, ఖరీఫ్ సాగుకు సకాలంలో వినియోగించుకోవాలని కోరడమైనది. ఈ సందర్భంగా వ్యవసాయ శాఖ అధికారులు పంటల ఎంపిక, విత్తన శుద్ధి, పద్ధతులు, సమగ్ర పంట యాజమాన్యం ప్రభుత్వ పథకాలపై రైతులకు అవగాహన కల్పిస్తారు. ధర్పల్లి మండలంలోని రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని జూలై 27, 28, 29 తేదీలలో హెున్నాజిపేట రైతు వేదికలో నిర్వహించే విత్తనాల మేళాకు అధిక సంఖ్యలో హాజరై నాణ్యమైన విత్తనాలను పొందవలసిందిగా మండల వ్యవసాయ అధికారి విజ్ఞప్తి చేశారు.

## జాతీయ గౌతమ బుద్ధ అవార్డు గ్రహీత

# ముత్యాల నర్సింలుకు ఘన సన్మానం

**బుద్ధ-పూలే-అంబేద్కర్ ఆశయాల ప్రచారానికి గుర్తింపుగా జాతీయ అవార్డు.. సామాజిక సేవకు విశిష్ట గౌరవం**



గజ్వేల్ ( ప్రశ్న న్యూస్ ) బుద్ధుడు, మహాత్మా జ్యోతిరావు పూలే, డా. బి.ఆర్. అంబేద్కర్ ఆశయాలను సమాజంలో విస్తృతంగా ప్రచారం చేస్తూ విశిష్ట సామాజిక సేవలు అందించిన బీఎస్ఐ సిద్ధిపేట జిల్లా ప్రధాన కార్యదర్శి ముత్యాల నర్సింలు రజక ధమ్మచారికి లభించిన ప్రతిష్ఠాత్మక జాతీయ గౌతమ బుద్ధ అవార్డు సందర్భంగా ఆదివారం దౌల్తాబాద్‌లో ఘన సన్మాన కార్యక్రమం నిర్వహించారు. దౌల్తాబాద్ మండల కేంద్రంలోని ఎస్వీ ఫంక్షన్ హాల్లో జరిగిన ఈ కార్యక్రమానికి రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు చిట్యాల శ్వేత, బుద్ధిష్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా రాష్ట్ర కార్యదర్శి ఉప్పర మల్లేశం, జిల్లా అధ్యక్షుడు ఎనగందుల శంకర్ బోధి ముఖ్య అతిథులుగా హాజరై నర్సింలును శాలువాతో సత్కరించి, పూలమాలలు వేసి జ్ఞాపికను అందజేశారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ

బుద్ధుడు బోధించిన కరుణ, సమానత్వం, అహింస, మానవత్వం, పూలే ప్రతిపాదించిన విద్య, సామాజిక న్యాయం, డా. అంబేద్కర్ చూపిన రాజ్యాంగ విలువలు, స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వంను ప్రజల్లో విస్తృతంగా చైతన్యం కల్పించేందుకు ముత్యాల నర్సింలు ఎన్నో ఏళ్లుగా నిరంతరం కృషి చేస్తున్నారని కొనియాడారు. బౌద్ధ ధర్మ ప్రచారం, మూఢనమ్మకాల నిర్మూలన, యువతలో రాజ్యాంగ అవగాహన పెంపు, బహుజన ఐక్యత కోసం ఆయన చేసిన సేవలు ఆదర్శప్రాయమని పేర్కొన్నారు. ఈ సేవలకు గుర్తింపుగానే ఆయనకు జాతీయ గౌతమ బుద్ధ అవార్డు లభించడం సిద్ధిపేట జిల్లాకే గర్వకారణమని, యువతకు ఆయన స్ఫూర్తిదాయక వ్యక్తిగా నిలుస్తున్నారని అభిప్రాయపడ్డారు. ఈ అవార్డు తన ఒక్కరికే కాకుండా సమాజ మార్పు కోసం శ్రమిస్తున్న ప్రతి సామాజిక కార్యకర్తకు దక్కిన గౌరవమని పేర్కొన్నారు. కార్యక్రమంలో తుమ్మ శ్రీనివాస్, చిప్పల యాదగిరి, దుబాషి సంజీవ్, బీఎస్ఐ కోశాధికారి సాయిబాబు, తిరుపతిరావు, తిరుపతి, పుట్ట రాజు, జర్నలిస్ట్ మహేష్, బోనాల స్వామి, మేకల రాములు, అరుణోదయ సాయి, ఎద్దు నరేందర్, తాళ్లపల్లి యాదగిరి, అడ్వకేట్ పాండరి, రాజేశ్వరరావు, వాసుదేవ రెడ్డి, ఆకారం సత్యం, రాజు, మహేందర్, ప్రేమ్ కుమార్, గౌతం తదితరులు పాల్గొన్నారు.

# నల్ల చట్టాలకు వ్యతిరేకంగా నాడు రైతుల పక్షానా

**లీకేజీలను నిరసిస్తూ నేడు విద్యార్థుల పక్షానా రాహుల్ గాంధీ**



ఎల్లారెడ్డిపేట( ప్రశ్న న్యూస్)కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వం నాడు రైతులకు వ్యతిరేకంగా నల్ల చట్టాలు తీసుకొచ్చి రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర లేకుండా చేసిన క్రమంలో 2021 లో పంజాబ్, హర్యానా, ఉత్తర్ ప్రదేశ్ రైతులందకి కాంగ్రెస్ పార్టీ రాహుల్ గాంధీ అండగా నిలిచి నల్ల చట్టాలకు వ్యతిరేకంగా నాడు రైతుల పక్షానాలీకేజీలకు నిరసనగా నేడు విద్యార్థుల పక్షానా రాహుల్ గాంధీ నిలిచారని సిరిసిల్ల శాసనసభ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి కేకే మహేందర్ రెడ్డి ఎల్లారెడ్డిపేట మండలం రాజన్నపేట గ్రామంలో 30 లక్షలతో నిర్మించనున్న వడ్ల గోదాముకు స్థానిక సర్పంచు బాపు రెడ్డి, ఏఎంసీ చైర్మన్ షేక్ సబేరా బేగం పాలకవర్గం సభ్యులతో కలిసి కేకే మహేందర్ రెడ్డి ఆదివారం భూమి పూజ చేశారు, అనంతరం కేకే మహేందర్ రెడ్డి మాట్లాడుతూ నల్ల చట్టాలకు వ్యతిరేకంగా 700 మంది రైతులు ప్రాణాలు కోల్పోతే కాంగ్రెస్ రాహుల్ గాంధీ వారికి అండగా నిలబడి కేంద్ర ప్రభుత్వం మెడలు వంచి నల్ల చట్టాలను తొలగించే విధంగా పోరాటం చేయడం జరిగిందన్నారు,, కేంద్ర బిజెపి ప్రభుత్వం రైతులు పండించిన దాన్యాన్ని కొనకపోయినా ఎమ్మెస్ పి ప్రకారం దాన్యాన్ని కొని డబ్బులు కూడా రెండు మూడు రోజుల్లో రైతుల ఖాతాలో వేసిన విషయం మీరు గమనిస్తున్నారన్నారు.రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఎక్కడ లేని విధంగా రైతు భరోసా ఇస్తు ధాన్యం సేకరణ కొనసాగిస్తుందన్నారు. వర్షాలను తట్టుకోడానికి రైతులు పండించిన దాన్యం సరైన ధరకు అమ్ముకోవాలంటే నిలువ ఉంచుకోడానికి గోదాములు అవసరం కాబట్టి రాజన్న సిరిసిల్ల జిల్లాలో 29 వడ్ల గోదాములను ఎల్లారెడ్డిపేట మండలంలో 11 గోదాములను మంజూరు చేయడం జరిగిందన్నారు. ఇది కాంగ్రెస్ పార్టీ కి రైతుల పట్ల ఉన్న నీతి నిజాయితీకి నిదర్శనమన్నారు. రాష్ట్రంలోనే కాదు దేశంలో ఏ ప్రజా సమస్యలువచ్చినా ఏఐసీసీ నేత రాహుల్ గాంధీ రైతులు అరుగాలం కష్టపడి పంటలు పండించినట్టు రాత్రింబవళ్లు అనేక రకాలుగా కష్టపడి చదివి నీట్ పరీక్ష రాస్తే కొంతమంది బిజెపి పెద్దలు వారి మంది మా అగాదులకే ఎంబీబీఎస్ ఇంజనీరింగ్ సీట్లు ఇప్పించుకోవాలనే ఉద్దేశంతో నీట్ పరీక్ష పేపర్ లీక్ చేస్తే విద్యార్థులకు అండగా నిలబడి బిజెపి మోడీ ప్రభుత్వంలోని విద్యాశాఖ మంత్రి ధర్మన్ ప్రధాన్ రాజీనామా చేసే విదంగా ప్రధానమంత్రి ఇంటిని ముట్టడించి ప్రజాస్వామ్యబద్ధంగా కొట్లాడితే ఈ ఫలితాలు ఉంటాయని భారత రాజ్యాంగాన్ని స్ఫూర్తిగా తీసుకొని కొట్లాడి బిజెపి మెడలు వంచిన ఘనత రాహుల్ గాంధీ కాంగ్రెస్ పార్టీదని ఆయన అన్నారు. యువతకు రైతులకు ఎక్కడ అన్యాయం జరిగినా కాంగ్రెస్ పార్టీ రాహుల్ గాంధీ అండగా ఉంటారన్నారు.రాబోయే కాలంలో కూడా ఈ రాష్ట్రం సర్వతో ముఖాభివృద్ధి జరగాలంటే మళ్లీ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావాలన్నారు తెలంగాణ రాష్ట్ర ప్రజలు అండగా ఉండాలన్నారుయువతకు 75 నుండి 80 వేల వరకు ప్రభుత్వ ఉద్యోగాలు ఇచ్చిన ఘనత రేవంత్ రెడ్డిది అన్నారు, గత ప్రభుత్వ హయాంలో మాజీ మంత్రి స్థానిక ఎమ్మెల్యే కేటీఆర్ తన మంది మగాదులందరి కి ఔట్సోర్సింగ్ కాంట్రాక్టు ద్వారా బంధువులందరికీ ఉద్యోగ ఏజెన్సీ లిచ్చి ఏజెన్సీల ద్వారా రిక్రూట్ చేసుకున్నారని కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ప్రభుత్వ ఎంప్లాయ్మెంట్ ద్వారా నోటిఫికేషన్లు ఇచ్చి ఉద్యోగాలు కల్పిస్తుందన్నారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఇచ్చిన మాటకు కట్టుబడి ఆరుగ్యారంటీలలో ఒక్కొక్కటిగా ఆర్థికంగా కెసిఆర్ ప్రభుత్వం ఈ రాష్ట్రాన్ని ఎనిమిదిన్నర లక్షల కోట్లకు దివాలా తీయించినప్పటికీ ఒక్కొక్కదాన్ని అధిగమించి మీకు అండగా ఉందన్నారు. రాజన్నపేట గ్రామంలో 24 లక్షలతో రెండు అంగన్వాడి భవనాలు 30 లక్షలతో వడ్లగోదాం 20 లక్షలతో సిసి రోడ్లు మంజూరు ఇవ్వడం జరిగిందని తమ గ్రామవృద్ధికి తన వంతు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచుల పోరం మండల అధ్యక్షులు దొమ్మాటి నరసయ్య, మాజీ మండల అధ్యక్షులు సద్ది లక్ష్మారెడ్డి, ఏఎంసి వైస్ ప్రెసిడెంట్ గుండాడి రాంరెడ్డి సర్పంచులు సిర్రం నాగరాజు యాదవ్ మామిళ్ల కిషన్ మాజీ సర్పంచ్ ముక్క శంకర్ ఉపసర్పంచ్ ఉడుగుల యాదగిరి , కాంగ్రెస్ పార్టీ నాయకులు షేక్ గౌస్ బండారి బాల్రెడ్డి, నంది కిషన్,శ్రీకాంత్ రెడ్డి, మధీ రెడ్డి లక్ష్మారెడ్డి గంట బుచ్చయ్య గౌడ్ ప్రవీణ్ రెడ్డి, ఇలియాస్ బాబా, వెంకటేష్ , నెమలికొండ శంకర్ భాస్కర్ సత్యం మంగ పద్మ వార్డు మెంబర్లు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## దేవేందర్ నగర్ కాలనీలో

# రౌడీ మూకల ఆట కట్టించాలి

- **దేవేందర్ నగర్ కాలనీవాసులకు అండగా రాజకీయ నాయకులు**
- **మేడిపల్లి పోలీస్ స్టేషన్ ముట్టడికి పిలుపునిచ్చిన అఖిలపక్షం సభ్యులు**
- **అఖిలపక్ష సమావేశంలో పాల్గొన్న బిజెపి,**
- **బిఆర్ఎస్, కాంగ్రెస్, సిపిఐ, జనసేన నాయకులు**



బోడుప్పల్(ప్రశ్న న్యూస్) మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ బోడుప్పల్ సర్కిల్ పరిధిలోని దేవేందర్ నగర్ కాలనీలో గత కొంతకాలంగా జరుగుతున్న దాడులు,గొడవలు నేపథ్యంలో కాలనీలో ప్రశాంత వాతావరణం నెలకొనాలని లక్ష్యంతో గత నెలలో గృహప్రవేశం జరుగుతున్న ఇంటి సభ్యుల పైన,అలాగే స్థానిక రిపోర్టర్ విష్ణు గౌడ్ ఇంటిపై రౌడీ గ్యాంగులు,గాంజా మూకలు రాళ్ల దాడి,కారు బైకుల ధ్వంసం ఘటనలో నిందితులపై బాధితులు మేడిపల్లి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసినప్పటికీ దాడికి ప్రధాన కారకులైన వ్యక్తులను కాకుండా ఇతర వ్యక్తులను అరెస్ట్ చేసి చేతులు దులుపుకున్నారని, తక్షణమే గొడవకు కారణమైన జెన్నరాజు, జెన్ననాగరాజు,సానిక ప్రశాంతు,హరీష్ అతని అనుచరులందరినీ తక్షణమే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేస్తూ దేవేందర్ నగర్ కాలనీలో అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో బిజెపి, బిఆర్ఎస్,కాంగ్రెస్, సిపిఐ,జనసేన, మొదలైన పార్టీ నాయకులు పాల్గొని బాధితులను,కాలనీవాసులను సమస్యలను క్షుణ్ణంగా అడిగి తెలుసుకున్నారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ పార్టీలకతీతంగా ప్రజల శాంతిభద్రతలకు విగాదం కలిగించే ఎవరినైనా క్షమించరాదని,దేవేందర్ నగర్ కాలనీలో గొడవలకు ప్రధాన కారకుడుగా భావిస్తున్న జెన్నరాజు,జెన్న నాగరాజు,సానిక ప్రశాంతు,హరీష్ ,స్థానిక యువకులకు మత్తు పదార్థాలను అలవాటు చేసి ఆయన అవసరాల కోసం పలు గోడవలలో వారిని వాడుకుంటున్నారని, చాలామంది యువత మద్యం గంజాయి వంటి మతపదార్థాలకు బానిసై తమ జీవితాలను నాశనం చేసుకుంటున్నారని, పలువురు బాధితులు లబోదిబోమన్నారు. అనంతరం పలువురు రాజకీయ నాయకులు మాట్లాడుతూ దేవేందర్ నగర్ కాలనీ ప్రజల సంక్షేమానికి కట్టుబడి ఉన్నామని, ఈ సంఘటనలో పోలీసుల వ్యవహారం కొంతమంది నాయకులకు తొత్తులుగా వ్యవహరిస్తున్నారని అనుమానం వ్యక్తపరుస్తున్నారు. ఈ సంఘటనలోని ప్రధాన నిందితులను అరెస్ట్ చేసే వరకు అఖిలపక్షం సభ్యులందరూ కాలనీవాసులకు అండగా ఉంటామని తెలుపుతూ సోమవారం మేడిపల్లి పోలీస్ స్టేషన్ ముట్టడికి పిలుపునిచ్చారు. ఈ అఖిలపక్ష సమావేశంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఫెడరేషన్ చైర్మన్ డాక్టర్ రాపోలు రాములు, మేడ్చల్ జిల్లా బి బ్లాక్ ప్రధాన కార్యదర్శి కొత్త కిషోర్ గౌడ్, మాజీ కార్పొరేటర్, బోడుప్పల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బొమ్మక్ కళ్యాణ్, బోడుప్పల్ బి ఆర్ ఎస్ పార్టీ అధ్యక్షుడు మంద సంజీవరెడ్డి ,ప్రధాన కార్యదర్శి మీసాల కృష్ణ, మాజీ కార్పొరేటర్ చీరాల నరసింహ, కాంగ్రెస్ సీనియర్ నాయకులు దానగల్ల యాదగిరి, జక్క రాములు, టిఆర్ఎస్ నాయకులు శ్రీధర్ గౌడ్, మేడ్చల్ జిల్లా బిజెపి నాయకులు జెనీగ వెంకటేష్, మేడిపల్లి మండల సిపిఐ పార్టీ అధ్యక్షులు రచ్చ కిషన్, జనసేన పార్టీ నాయకుడు సాయికుమార్, దేవేందర్ నగర్ కాలనీ అధ్యక్షుడు దయ్యాల మహేష్, జనరల్ సెక్రటరీ తాటికాయల యాదగిరి, అంబేద్కర్ నగర్ అధ్యక్ష దేశపాక నరసింహ, నాయకులు ఎడ్ల శ్రీనివాస్ రెడ్డి, గడ్డం యాదగిరి, దండు రమేష్, బాలస్వామి,పంగ రమేష్, భగవంతు, సదానంద్, కాలనీ కమిటీ సభ్యులు పండుగ యాకయ్య,అఫ్జల్, అన్వర్, వెంకటేష్, మారపాక మధు, ఆరోగ్యం, మహిళలు నర్సమ్మ, పద్మ, జంగమ్మ, లావణ్య, శ్రీలత ,రేణుక, అంజమ్మ, ఉప్పమ్మ తదితరులు పాల్గొన్నారు.

## సీపీఐ సీనియర్ నేత పముజుల దశరథ రామయ్యకు

**- మంత్రి నారాయణ నివాళి**



నెల్లూరు (ప్రశ్న న్యూస్) భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) సీనియర్ నాయకుడు, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు పముజుల దశరథ రామయ్య మృతి పట్ల రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. ఆదివారం నెల్లూరులోని సంతపేట సీపీఐ కార్యాలయంలో ప్రజల సందర్శనార్థం ఉంచిన పముజుల దశరథ రామయ్య భౌతికకాయాన్ని మంత్రి నారాయణ సందర్శించి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి నారాయణ మాట్లాడుతూ, పముజుల దశరథ రామయ్య మృతి నెల్లూరు జిల్లాకు తీరని లోటని అన్నారు. సుమారు నాలుగు దశాబ్దాల పాటు సౌత్ మోపూరు గ్రామానికి సర్పంచ్‌గా, ఎంపీటీసీగా ప్రజలకు సేవలందిస్తూ గ్రామాభివృద్ధికి విశేష కృషి చేశారని కొనియాడారు. పేదల హక్కుల కోసం నిరంతరం పోరాడిన నాయకుడిగా, భూ ఉద్యమాల్లో కీలక పాత్ర పోషించిన ప్రజానాయకుడిగా ఆయన గుర్తింపు పొందారని మంత్రి పేర్కొన్నారు. సామాన్య కార్యకర్తగా సీపీఐలో తన రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించి ప్రజల విశ్వాసాన్ని చూరగొన్న నాయకుడిగా ఎదిగారని తెలిపారు. నెల్లూరు జిల్లా రాజకీయ, సామాజిక రంగాల్లో పముజుల దశరథ రామయ్య అందించిన సేవలు చిరస్థాయిగా నిలిచిపోతాయని మంత్రి అన్నారు. ఆయన మృతితో సౌత్ మోపూరు గ్రామం తన పెద్దదిక్కును కోల్పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషాదాన్ని తట్టుకునే ధైర్యాన్ని భగవంతుడు వారి కుటుంబ సభ్యులకు ప్రసాదించాలని ప్రార్థిస్తూ మంత్రి నారాయణ తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ తాళ్లపాక అనూరాధ, నగర టీడీపీ నాయకులు, సీపీఐ కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొని పముజుల దశరథ రామయ్యకు ఘన నివాళులర్పించారు.

## సైకిళ్ల పండుగకు సర్వం సిద్ధం

**నేడు 7 వేల మంది విద్యార్థులకు ఉచిత సైకిళ్ల పంపిణీ**





నెల్లూరు (ప్రశ్న న్యూస్) ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల విద్యాభ్యాసానికి తోడ్పాటుగా నిర్వహిస్తున్న "సైకిళ్ల పండుగ"కు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. నెల్లూరులోని వి.ఆర్. మున్సిపల్ హైస్కూల్ మైదానంలో సోమవారం సాయంత్రం జరిగే కార్యక్రమంలో తొలి విడతగా 8, 9, 10వ తరగతులు చదువుతున్న సుమారు 7 వేల మంది విద్యార్థులకు ఉచిత సైకిళ్లను పంపిణీ చేయనున్నారు. కార్యక్రమ ఏర్పాట్లను రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ తన సతీమణి పొంగూరు రమాదేవి, కుమార్తె పొంగూరు షరణితో కలిసి ఆదివారం పరిశీలించారు. వేదిక ఏర్పాట్లు, సైకిళ్ల పంపిణీ విధానం, విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలపై అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా పొంగూరు రమాదేవి మాట్లాడుతూ, కుటుంబ సభ్యులతో కలిసి ఏర్పాట్లను పరిశీలించేందుకు వచ్చినట్లు తెలిపారు. కార్యక్రమం గురించి మనవళ్లు అడగడంతో ఇది నిజంగా "సైకిళ్ల పండుగ" అని చెప్పానని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులు ప్రతిరోజూ పాఠశాలకు వెళ్లేందుకు ఎదుర్కొంటున్న రవాణా ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు ఆమె తెలిపారు. విద్యార్థులకు నాణ్యమైన హీరో కంపెనీ సైకిళ్లను ప్రత్యేకంగా తయారు చేయించి పంపిణీ చేస్తున్నామని వెల్లడించారు. తన చిన్నతనంలో చదువుకోవడానికి ఎదురైన కష్టాలు నేటి విద్యార్థులు ఎదుర్కోకూడదనే సంకల్పంతో మంత్రి నారాయణ ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారని ఆమె పేర్కొన్నారు. విద్యార్థులు సమయానికి పాఠశాలకు చేరుకోవడంతో పాటు వారి చదువుపై మరింత దృష్టి సారించేలా ఈ కార్యక్రమం ఉపయోగపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. సోమవారం సాయంత్రం 4 గంటలకు వి.ఆర్. మున్సిపల్ హైస్కూల్ మైదానంలో జరిగే ఈ కార్యక్రమంలో వేలాది మంది విద్యార్థులు, తల్లిదండ్రులు, ప్రజాప్రతినిధులు పాల్గొననున్నారు. ఉచిత సైకిళ్ల పంపిణీతో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల రవాణా సమస్యలకు గణనీయమైన ఉపశమనం లభిస్తుందని నిర్వాహకులు పేర్కొన్నారు.

## పలాస కిడ్నీ రీసెర్చ్ ఆసుపత్రి అభివృద్ధికి నీతి ఆయోగ్ బృందం కసరత్తు

**ఆధునిక వైద్య వసతుల కల్పనపై సమీక్ష: ఎమ్మెల్యే గౌతు శిరీష**



పలాస (ప్రశ్న న్యూస్)పలాసలోని కిడ్నీ రీసెర్చ్ ఆసుపత్రిలో కిడ్నీ బాధితులకు మరింత నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు ఆధునిక వసతుల కల్పన దిశగా కీలక చర్యలు ప్రారంభమయ్యాయి. ఈ మేరకు నీతి ఆయోగ్‌కు చెందిన నిపుణుల బృందం ఆదివారం ఆసుపత్రిని సందర్శించి అందుబాటులో ఉన్న వైద్య సేవలు, మౌలిక సదుపాయాలను క్షుణ్ణంగా పరిశీలించింది. నీతి ఆయోగ్ ప్రతినిధి డాక్టర్ శ్రీనివాస్, ఎయిమ్స్ నెఫ్రాలజీ విభాగాధిపతి డాక్టర్ దీపాంకర్, నిమ్స్ నెఫ్రాలజీ విభాగాధిపతి డాక్టర్ రాజు తదితర నిపుణులతో కూడిన బృందం స్థానిక ఎమ్మెల్యే శ్రీమతి గౌతు శిరీషతో కలిసి ఆసుపత్రిలోని వివిధ విభాగాలను సందర్శించింది. కిడ్నీ వ్యాధిగ్రస్తులకు అందుతున్న వైద్య సేవలు, అవసరమైన అదనపు సౌకర్యాలు, భవిష్యత్తు అభివృద్ధి ప్రణాళికలపై సమగ్రంగా సమీక్ష నిర్వహించింది. ఈ సందర్భంగా కిడ్నీ రోగులతో నిరంతరం ఫోన్ ద్వారా సంప్రదింపులు జరిపి వారి ఆరోగ్య పరిస్థితిని పర్యవేక్షించడం, వ్యాధిపై అవగాహన కల్పించడం, చికిత్సకు సంబంధించిన మార్గదర్శకాలు అందించడం వంటి అంశాలపై ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని నిపుణుల బృందం సూచించింది. అలాగే కిడ్నీ వ్యాధుల నివారణ, చికిత్స, పరిశోధన కార్యక్రమాలను మరింత విస్తరించే అంశాలపై కూడా చర్చించారు. పర్యటన అనంతరం ఆసుపత్రి అభివృద్ధికి అవసరమైన అత్యాధునిక వైద్య పరికరాలు, అదనపు మౌలిక వసతులు, నిపుణుల సేవలు, నిధుల అవసరంపై సమగ్ర నివేదికను రాష్ట్ర ప్రభుత్వానికి సమర్పించాలని నిర్ణయించారు. ఆ నివేదిక ఆధారంగా మరిన్ని నిధులు, వైద్య సదుపాయాలు మంజూరు చేసేలా చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. కిడ్నీ వ్యాధులు అధికంగా ప్రభావం చూపుతున్న ఉత్తరాంధ్ర ప్రాంత ప్రజలకు పలాస కిడ్నీ రీసెర్చ్ ఆసుపత్రి మరింత సమర్థవంతమైన వైద్య కేంద్రంగా రూపుదిద్దుకునే దిశగా ఈ పర్యటన కీలక ముందడుగుగా నిలిచిందని వైద్యవర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

# నల్లమట్టి మాఫియా నరమేధం

**రాజధాని రహదారులపై మరణమృదంగం**

**సీఆర్డీఏ పరిధిలో అక్రమ తవ్వకాలు**

**ట్రిప్పుల కమిషన్ల మత్తులో ప్రాణాలతో చెలగాటం**

**- ఉండవల్లి ప్రమాదం మరో హెచ్చరిక**

**(వెంకట్ - ప్రశ్న న్యూస్ ఏపీ స్టేట్ బ్యూరో )**



రాజధాని అమరావతి నిర్మాణం రాష్ట్ర అభివృద్ధికి ప్రతీక కావాల్సిన సమయంలో, అదే ప్రాంతం అక్రమ నల్లమట్టి మాఫియాకు కేంద్రంగా మారుతోందన్న ఆరోపణలు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయి. నిర్మాణాలకు అవసరమైన మట్టి పేరిట సీఆర్డీఏ పరిధిలో భారీ ఎత్తున నల్లమట్టిని నిబంధనలకు విరుద్ధంగా తవ్వడం, అక్రమంగా తరలించడం, దళారుల ద్వారా విక్రయించడం, ఈ అక్రమ రవాణాలో ప్రజల ప్రాణాలను పణంగా పెట్టడం వంటి అంశాలు స్థానికులను తీవ్ర భయాందోళనకు గురిచేస్తున్నాయి.

ఇటీవల ఉండవల్లి గుంటూరు ఛానల్ వంతెనపై జరిగిన ప్రమాదం ఈ మాఫియా అరాచకానికి మరో నిదర్శనంగా మారింది. అక్రమంగా నల్లమట్టి తరలిస్తున్నట్లు చెప్పబడుతున్న ఓ లారీ అత్యంత వేగంగా దూసుకొచ్చి ఎదురుగా వస్తున్న కారును ఢీకొట్టింది. అదృష్టవశాత్తూ కారులోని ప్రయాణికులు ప్రాణాలతో బయటపడ్డారు. ప్రమాదం మరింత తీవ్రంగా జరిగి ఉంటే పెద్ద విషాదం చోటుచేసుకునేదనే అభిప్రాయం స్థానికుల్లో వ్యక్తమవుతోంది.

స్థానికుల కథనం ప్రకారం, ప్రమాదానికి కారణమైన డ్రైవర్ మద్యం మత్తులో ఉన్నాడని, సరైన డ్రైవింగ్ లైసెన్స్ కూడా లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ అంశాలు అధికారిక దర్యాప్తులో తేలాల్సి ఉన్నప్పటికీ, ఇటువంటి ఆరోపణలు ప్రజల్లో ఆందోళనను మరింత పెంచుతున్నాయి.

### ట్రిప్పుల కమిషన్లే ప్రాణాలకు ముప్పు.?

నల్లమట్టి అక్రమ రవాణాలో ట్రిప్పుల సంఖ్యే ప్రధాన లక్ష్యంగా మారిందని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఒక్కో ట్రిప్పుకు రూ.500 నుంచి రూ.1,500 వరకు అదనపు కమిషన్ ఇస్తామని చెప్పి డ్రైవర్లపై ఒత్తిడి తెస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఫలితంగా డ్రైవర్లు వేగ పరిమితులను పట్టించుకోకుండా రోడ్లపై దూసుకెళ్తున్నారని స్థానికులు చెబుతున్నారు. దీని ప్రభావం సామాన్య ప్రజలపై పడుతోంది. పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు, ఉద్యోగులు, రైతులు, ద్విచక్ర వాహనదారులు ప్రతిరోజూ భయంతో ప్రయాణించే పరిస్థితి ఏర్పడిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### దళారుల చేతుల్లో నల్లమట్టి వ్యాపారం

సీఆర్డీఏ పరిధిలోని కొన్ని ప్రాంతాల నుంచి తవ్వుతున్న నల్లమట్టిని కొంతమంది కాంట్రాక్టర్లు, దళారులు అక్రమంగా ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. విజయవాడ, గుంటూరు తదితర ప్రాంతాల్లో ఈ మట్టిని విక్రయిస్తున్నారని స్థానికులు చెబుతున్నారు. ఈ ఆరోపణలు నిజమైతే ప్రభుత్వ ఆదాయానికి నష్టం వాటిల్లడమే కాకుండా పర్యావరణ నిబంధనల ఉల్లంఘన కూడా అవుతుంది.

### పర్యావరణానికి ముప్పు

అనుమతులకు మించి తవ్వకాలు జరిగితే భూగర్భ జలాలపై ప్రభావం పడే అవకాశం ఉందని పర్యావరణ నిపుణులు చెబుతున్నారు. వ్యవసాయ భూముల సారవంతత తగ్గిపోవడం, వర్షపు నీటి నిల్వ వ్యవస్థ దెబ్బతినడం, భూభాగం అసమతుల్యంగా మారడం వంటి సమస్యలు తలెత్తే ప్రమాదం ఉంది.

### ఇది మొదటి ప్రమాదం కాదు

ఉండవల్లి సాయిబాబా ఆలయం సమీపంలో గతంలో జరిగిన ఘోర ప్రమాదంలో ఓ వృద్ధురాలు ప్రాణాలు కోల్పోయిన ఘటనను స్థానికులు గుర్తు చేస్తున్నారు. ఆ సంఘటన తర్వాత కూడా పరిస్థితుల్లో గణనీయమైన మార్పు కనిపించలేదని వారు అంటున్నారు. వరుస ప్రమాదాలు జరుగుతున్నా అక్రమ రవాణాపై సమర్థవంతమైన చర్యలు కనిపించడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.

### ప్రజల డిమాండ్లు

- స్థానికులు ప్రభుత్వం, సీఆర్డీఏ, గనుల శాఖ, రవాణా శాఖ, పోలీసు శాఖలకు పలు డిమాండ్లు చేస్తున్నారు.
- అక్రమ నల్లమట్టి తవ్వకాలపై ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేయాలి.
- ప్రతి లారీకి జీపీఎస్ ట్రాకింగ్ తప్పనిసరి చేయాలి.
- డ్రైవర్ల లైసెన్సులు, వాహనాల ఫిట్‌నెస్‌ను క్రమం తప్పకుండా తనిఖీ చేయాలి.
- మద్యం సేవించి వాహనాలు నడిపే డ్రైవర్లపై కఠిన చర్యలు తీసుకోవాలి.
- అక్రమ రవాణాకు సహకరించే వారిపై కూడా చట్టపరమైన చర్యలు చేపట్టాలి.
- ప్రమాదాలకు గురయ్యే ప్రధాన రహదారులపై సీసీ కెమెరాల నిఘా పెంచాలి.

### ప్రభుత్వం ముందున్న సవాలు

రాజధాని నిర్మాణం వేగంగా సాగడం ఎంత ముఖ్యమో, ఆ పనులు చట్టబద్ధంగా, ప్రజల భద్రతకు భంగం కలగకుండా జరగడం అంతకంటే ముఖ్యమైనది. అక్రమ తవ్వకాలు, అనుమతులకు విరుద్ధంగా రవాణా, రోడ్లపై నిర్లక్ష్య డ్రైవింగ్ వంటి అంశాలపై సంబంధిత శాఖలు కఠినంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని ప్రజలు కోరుతున్నారు. నల్లమట్టి అనేది కేవలం నిర్మాణానికి అవసరమైన వనరు మాత్రమే కాదు; దాని పేరుతో చట్టాలను ఉల్లంఘిస్తూ ప్రజల ప్రాణాలను ప్రమాదంలోకి నెట్టే పరిస్థితి ఎప్పటికీ ఆమోదయోగ్యం కాదు. ప్రమాదం జరిగిన ప్రతిసారీ కేసు నమోదు చేయడం మాత్రమే కాకుండా, ప్రమాదాలకు దారితీసే అక్రమ వ్యవస్థపై మూలాలతో సహా చర్యలు తీసుకోవడం అత్యవసరం. ఉండవల్లి ఘటన అదృష్టవశాత్తూ ప్రాణనష్టం లేకుండా ముగిసింది. కానీ ప్రతి ప్రమాదం అంతే అదృష్టాన్ని తీసుకురాదు. రాజధాని ప్రాంతంలో అభివృద్ధి పేరుతో జరుగుతున్న ప్రతి కార్యకలాపం చట్టబద్ధంగా, పారదర్శకంగా, ప్రజల భద్రతకు ప్రాధాన్యతనిస్తూ సాగాల్సిన బాధ్యత అధికార యంత్రాంగంపై ఉంది.

## భోగాపురం సభకు ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోండి

**- ఎమ్మెల్యే గౌతు శిరీష**



పలాస(ప్రశ్న న్యూస్) భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభోత్సవం సందర్భంగా ఆగస్టు 1న నిర్వహించనున్న భారీ బహిరంగ సభకు నియోజకవర్గం నుంచి వెళ్లే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని పలాస ఎమ్మెల్యే శ్రీమతి గౌతు శిరీష అధికారులను ఆదేశించారు. ఆదివారం పలాసలోని తన కార్యాలయంలో నియోజకవర్గ పరిశీలకులు కోళ్ల అప్పలనాయుడు, ప్రత్యేక పరిశీలకులు పి. చంద్రమౌళి, పార్టీ ముఖ్య నాయకులు, వివిధ శాఖల అధికారులతో ఎమ్మెల్యే ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా భోగాపురం ఎయిర్‌పోర్టు ప్రారంభోత్సవ సభకు నియోజకవర్గం నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరుకానున్న నేపథ్యంలో రవాణా, తాగునీరు, ప్రయాణ సమన్వయం తదితర ఏర్పాట్లపై సమగ్రంగా చర్చించారు. గ్రామాల నుంచి బయలుదేరే ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. సభకు హాజరయ్యే ప్రతి ఒక్కరూ సురక్షితంగా వెళ్లి తిరిగి వచ్చేలా ప్రణాళికాబద్ధంగా ఏర్పాట్లు చేయాలని, సంబంధిత శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేయాలని ఎమ్మెల్యే గౌతు శిరీష పేర్కొన్నారు. సమావేశంలో మండల స్థాయి పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు పాల్గొని సభ విజయవంతానికి చేపట్టాల్సిన చర్యలపై చర్చించారు.

## ఆచార్య కొత్తపల్లి జయశంకర్ జాతీయ అవార్డు అందుకున్న కిరణ్ కుమార్



హైదరాబాద్ ( ప్రశ్న న్యూస్) హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో దొడ్డి కొమురయ్య హాల్ లో బహుజన సాహిత్య అకాడమీ ఆధ్వర్యంలో ఆదివారం నాడు నిర్వహించిన కార్యక్రమంలో దొమ్మటి కిరణ్ కుమార్ రావు కి ఆచార్య కొత్తపల్లి జయశంకర్ జాతీయ అవార్డుతో పాటు శాలువాతో ఘనంగా సత్కారించిన బహుజన సాహిత్య అకాడమీ జాతీయ అధ్యక్షులు నల్ల రాధాకృష్ణ ఈకార్యమనిక ముఖ్యఅతిధిగా తెలంగాణ రాష్ట్ర మంత్రి అడ్లూరి లక్ష్మణ్ హాజరై అవార్డులు ప్రధానం చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ఏరుపాటులో( జె.ఏ.సి. ) జాయింట్ యాక్షన్ కమిటీ పాత్ర ఎంతో కీలకమైనది. రాష్ట్ర సాధన కోసం జెఏసి ఆధ్వర్యంలో జిల్లా ల వ్యాప్తంగా నిరాహార దీక్షలు రోడ్లు, బ్లాక్ లు, ర్యాలీలు, నిరసనలు, నిర్వహించిన, కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చాం అనిరసనలే తెలంగాణ సాధనకు దారితీసాయి ఉద్యమంలో జేఏసీ కన్వీనర్ గా దొమ్మాటి కిరణ్ కుమార్ రావు చేసిన సేవలు, కృషి ప్రశంసనీయమైనవి అని అన్నారు. ఈ సందర్భంగా దొమ్మాటి కిరణ్ కుమార్ రావు మాట్లాడుతూ నాకు ఈ అవార్డు రావడానికి సహకరించిన (బి.ఎస్.ఏ ) బహుజన సాహితి అకాడమీ జాతీయ అధ్యక్షులు నల్ల రాధాకృష్ణ ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

## శ్రీశైలం మల్లన్న భక్తులకు అన్నప్రసాద కేంద్రంలో ఆహా ఏమి రుచి

**నిత్యం భక్తుల సేవలో ఆలయ ఈవో ఎం శ్రీనివాసరావు**

**మెరుగైన సేవలు అందిచలని అధికారులకు ఆదేశాలు జారీ చేసారు**





శ్రీశైలం (ప్రశ్న న్యూస్ )ద్వాదశ జ్యోతిర్లింగాలైనటువంటి శ్రీశైల మహా క్షేత్రంకి ఇప్పటికే ప్రధానమంత్రి మోదీ పర్యటించిన తర్వాత శ్రీశైలం మహా క్షేత్రానికి భక్తులు తాకిడి పెరిగింది గత ప్రభుత్వంలో శ్రీశైలం మల్లన్న భక్తులు తక్కువ సంఖ్యలో దర్శించుకోవడం జరిగింది. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ప్రధానమంత్రి నరేంద్ర మోడీ శ్రీశైలం స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు అనంతరం శ్రీశైలం మల్లన్న క్షేత్రనికి భక్తుల రద్దీ భారీ స్థాయికి చేరుకుంది. స్వామి అమ్మవార్ల అన్నప్రసాద వితరణ స్వీకరించడానికి గత ప్రభుత్వం కంటే ఎక్కువ సంఖ్యలో పైగా స్వామి అమ్మవార్ల భక్తులు అన్నప్రసాదాన్ని స్వీకరిస్తున్నారు. దాదాపు ఒక్క రోజుకి 10000 నుండి 20 వేల మంది దాకా అన్న ప్రసాదము స్వీకరించడం జరుగుతుంది. అలాగే డొనేషన్లు భారీ స్థాయిలో ఆలయానికి సమర్పిస్తునారు. భక్తులను దృష్టిలో ఉంచుకొని ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా భక్తులకు ఎప్పటికప్పుడు అన్న ప్రసాదం తయారు చేయడంలో అధికారులు పాటు పడుతున్నారు. ఎటువంటి లోటుపాట్లు లేకుండా అన్న ప్రసాదంతో పాటు పలు రకాల స్వీట్ లను తయారు చేయించి భక్తులకు అందుబాటులో ఉంచామన్నారు. ఇప్పటిదాకా అన్న ప్రసాదం స్వీకరించిన భక్తులు మా సొంత స్వగృహం నందు అన్న ప్రసాదం తయారు చేసుకొని తిని నట్టు ఉందని భక్తులు ఆనందం వ్యక్తం చేశారు.

## గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీలో పందుల సంచారం

**- ప్రజలకు తీవ్ర ఇబ్బందులు**

**- 14, 15 16,వ వార్డుల్లో మళ్లీ దర్శనమిస్తున్న పందులు**

**- తక్షణమే చర్యలు తీసుకోవాలని స్థానికుల విజ్ఞప్తి**



గజ్వేల్ ( ప్రశ్న న్యూస్ ) సిద్దిపేట జిల్లా గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలోని 14, 15 16,వ వార్డుల్లో గత కొన్ని రోజులుగా పందుల సంచారం విపరీతంగా పెరిగిపోయి, స్థానిక ప్రజలకు తీవ్ర ఇబ్బందికరంగా మారింది. వార్డుల్లో పదుల సంఖ్యలో పందులు స్వేచ్ఛగా తిరుగుతుండటంతో అపరిశుభ్రత పెరిగిపోవడమే కాకుండా, రాత్రి సమయంలో రోడ్లపై వెళ్లే వాహనదారులకు, స్థానికులకు ప్రమాదకరంగా పరిణమించాయి. సాధారణంగా గ్రామీణ ప్రాంతాల్లో పందుల పెంపకాన్ని ఊరి చివర లేదా జనావాసాలకు దూరంగా ఉండే ప్రాంతాలలో మాత్రమే చేపడతారు. కానీ, గజ్వేల్ ప్రజ్ఞాపూర్ లాంటి మున్సిపాలిటీలో మాత్రం నివాస గృహాలు ఉన్న వార్డుల్లోనే పందులు సంచరిస్తుండటం విడ్డూరంగా ఉందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనివల్ల సీజనల్ వ్యాధులు వ్యాపించే అవకాశం ఉందనే భయం ప్రజలను వెంటాడుతోంది. గతంలో కూడా ఈ సమస్యపై అధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ, కొద్ది రోజులు మాత్రమే కట్టుదిట్టమైన చర్యలు చేపట్టి, ఆ తర్వాత మళ్లీ పట్టించుకోవడం లేదని వార్డు ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ ఉన్నతాధికారులు స్పందించి, నివాస ప్రాంతాల్లో తిరుగుతున్న పందులను వెంటనే మున్సిపల్ పరిధి దాటించి, ప్రజల ఆరోగ్య పరిరక్షణకు తగిన చర్యలు తీసుకోవాలని 14, 15 16, వ వార్డుల ప్రజలు కోరుతున్నారు.



### తన మొదటి సినిమా వెనుక

# కథ చెప్పిన రకుల్ ప్రీత్

ప్రముఖ కథానాయిక రకుల్ ప్రీత్ సింగ్ తన సినీ ప్రస్థానం ప్రారంభమైన తీరు గురించి పలు ఆసక్తికర విషయాలను పంచుకున్నారు. సినిమాలపై మక్కువతో కాకుండా, కేవలం ఒక కారు కొనుక్కోవాలనే లక్ష్యంతోనే తాను నటిగా మారినట్లు ఆమె వెల్లడించారు. ఇటీవల జరిగిన 'రైజింగ్ భారత్ సమ్మిట్'లో పాల్గొన్న రకుల్... తాను కళాశాలలో చదువుతున్న రోజుల్లోనే కన్నడ చిత్ర పరిశ్రమ నుంచి అనుకోకుండా అవకాశం వచ్చిందని తెలిపారు. తన ఛాయాచిత్రాలను చూసిన కొందరు ప్రతినిధులు తన తండ్రిని సంప్రదించి, సినిమాలో నటించమని కోరారని ఆమె గుర్తు చేసుకున్నారు. ఆ సమయంలో తనకు సినిమాలపై పెద్దగా అవగాహన లేకపోయినప్పటికీ, వారు రూ. 5 లక్షల పారితోషికం ఆఫర్ చేయడంతో వెంటనే అంగీకరించానని చెప్పారు. ఆ డబ్బుతో కారు కొనుగోలు చేసి, తన స్నేహితుల బృందంలో సొంతంగా కారు కొన్న మొదటి అమ్మాయిగా నిలవాలనేదే తన అప్పటి ఏకైక ఆశయమని రకుల్ చిరునవ్వుతో తెలిపారు. ఆ సినిమా కోసం సుమారు 40 రోజుల పాటు చిత్రీకరణలో పాల్గొన్నానని, ఆ సమయంలో కెమెరా ముందు నటించడం తనకు ఎంతో నచ్చిందని వివరించారు. అయితే, ముందుగా తన డిగ్రీ పూర్తి చేయాలని నిశ్చయించుకుని, ఆ తర్వాతే పూర్తిస్థాయిలో చిత్ర పరిశ్రమలోకి ప్రవేశించానని ఆమె పేర్కొన్నారు. ఎటువంటి సినీ నేపథ్యం (గాడ్‌ఫాదర్) లేకుండా 2013లో తిరిగి వచ్చి, ఇక్కడి పరిస్థితులను స్వయంగా నేర్చుకున్నానని స్పష్టం చేశారు. ప్రారంభ దశలో చదువు కారణంగా కొన్ని భారీ ప్రాజెక్టులను కూడా వదులుకోవాల్సి వచ్చిందని రకుల్ తెలిపారు. రకుల్ 2009లో కన్నడ చిత్రం 'గిల్లి'తో సినీ రంగప్రవేశం చేయగా, 2013లో విడుదలైన 'వెంకటాద్రి ఎక్స్‌ప్రెస్'తో తెలుగు ప్రేక్షకులకు పరిచయమయ్యారు. ప్రస్తుతం ఆమె హిందీలో ప్రతిష్టాత్మకంగా రూపొందుతున్న 'రామాయణ' చిత్రంలో శూర్పణఖ పాత్రలో కనిపించనున్నారు.

# 'చెన్నై లవ్‌స్టోరీ' నమ్మకాన్ని నిలబెట్టింది



కిరణ్ అబ్బవరం కథానాయకుడిగా రవి నంబూరి దర్శకత్వంలో ఎస్‌కేఎన్, సాయిరాజేష్ నిర్మించిన 'చెన్నై లవ్‌స్టోరీ' చిత్రం ఇటీవలే ప్రేక్షకుల ముందుకొచ్చింది. శనివారం సక్సెస్‌మీట్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా కిరణ్ అబ్బవరం మాట్లాడుతూ..ప్రీమియర్స్ నుంచే థియేటర్స్ వద్ద హౌస్‌ఫుల్ బోర్డులు దర్శనమిస్తున్నాయని, ఫ్యామిలీ ఆడియెన్స్ సినిమాకు బాగా కనెక్ట్ అవుతున్నారని ఆనందం వ్యక్తం చేశారు. నిర్మాత ఎస్‌కేఎన్ మాట్లాడుతూ 'యూనివర్సల్ అప్పీల్ ఉండే కథతో ఈ సినిమా తీశాం. బయ్యర్స్, డిస్ట్రిబ్యూటర్స్ ఫోన్ చేసి షోస్ పెంచుతున్నామని చెబుతున్నారు. మొదటిరోజే 12.3కోట్లు వసూలు చేసింది. హీరో కిరణ్ అబ్బవరంకు హ్యాట్రిక్ విజయమిది. కలర్‌ఫోటో, బేబి సినిమాలతో మా సంస్థకు మంచి పేరొచ్చింది. నేడు 'చెన్నై లవ్‌స్టోరీ' మా నమ్మకాన్ని మరింతగా నిలబెట్టింది. మంచి కంటెంట్‌తో సినిమా తీస్తే ప్రేక్షకులు బ్రహ్మరథం పడతారనడానికి ఈ సినిమా విజయమే నిదర్శనం' అన్నారు. ఈ సినిమా తమ సంస్థ గౌరవాన్ని పెంచిందని చిత్ర రచయిత, నిర్మాత సాయిరాజేష్ ఆనందం వ్యక్తం చేశారు. తొలి సినిమాకే బ్లాక్‌బస్టర్ సక్సెస్ రావడంతో దర్శకుడిగా తన కల నిజమైందని దర్శకుడు రవి నంబూరి పేర్కొన్నారు.



# ఆ డైరెక్టర్ల కథకు ఓకే చెప్పిందా?

దర్శక ద్వయం రాజ్, డీకేలలో ఒకరైన రాజ్ నిడిమోరు 'మా ఇంటి బంగారం' సినిమాకు కథ అందించి వంద కోట్ల విజయాన్ని అందుకున్నారు. తెలుగులో మహిళా ప్రధాన చిత్రానికి వందకోట్లు రావడం ఇదే ప్రథమం. ఈ జోష్‌ని ఇలాగే కొనసాగిస్తూ, తన మిత్రుడు కృష్ణ దాసరి(డీకే)తో కలిసి రాజ్ నిడియోరు మరో లేడీఓరియెంటెడ్ ప్రయత్నానికి శ్రీకారం చుట్టారు. ఈ సారి వీరి కథకు నాయికగా రష్మిక మందన్నను ఎంచుకున్నారట. ఇటీవలే రష్మికకు లైన్ కూడా వివరించారట. ఆమె కూడా రాజ్‌డీకేలతో కలిసి పనిచేసేందుకు ఉత్సాహంగా ఉన్నట్టు వినికిడి. ప్రస్తుతం కథాచర్చలు ప్రాథమిక దశలోనే ఉన్నాయి. దీనికి సంబంధించిన అధికారిక ప్రకటన త్వరలోనే వచ్చే అవకాశం ఉంది. యూనివర్సల్ అప్రోచ్ ఉన్న డైరెక్టర్లు రాజ్–డీకేలతో రష్మిక పనిచేస్తుండటంతో ఈ ప్రా జెక్ట్‌పై ఆడియన్స్‌లో ఆసక్తి నెలకొన్నది.

# రంగ్‌బర్సే.. కలలు మురిసే



అగ్ర కథానాయకుడు సూర్య నటిస్తున్న తాజా ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ 'విశ్వనాథ్ అండ్ సన్స్'. వెంకీ అట్లూరి దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమా ఆగస్ట్ 14న ప్రేక్షకుల ముందుకురానుంది. ఇప్పటికే విడుదలైన టీజర్ ప్రేక్షకుల్ని అమితంగా ఆకట్టుకోవడంతో సినిమాపై అంచనాలు పెరిగాయి. 45 ఏళ్ల మధ్య వయస్కుడైన హీరోపై ఇష్టం పెంచుకునే ఓ ఇరవై ఏళ్ల అమ్మాయి, వారి అనుబంధం నేపథ్యంలో వినోదం, భావోద్వేగాల కలబోతగా ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. శనివారం ఈ సినిమా నుంచి రెండోగీతం 'ది వెడ్డింగ్ సాంగ్'ను విడుదల చేశారు. జీవీ ప్రకాష్‌కుమార్ స్వరపరచిన ఈ పాటను రామజోగయ్య శాస్త్రి రచించారు. ఈ పాటను హీరో సూర్య స్వయంగా ఆలపించడం విశేషం. 'కన్నూ కన్నూ ఒక్కటిగా చేరంగా, చేతిలో చేయి వేసి సల్లాపాలే సాగంగా...చుట్టూరా చుట్టాలంతా ఆనందాలే పాడంగా, అదిరే పెళ్లి కల జిగేల్ అనంగా, రంగ్‌బర్సే..కలలు మురిసే కాలం ఎదురవగా' అంటూ పెళ్లి వేడుక తాలూకు సందడికి అద్దం పడుతూ ఈ పాట సాగిం ది. ఇందులో సూర్య, మమితాబైజు నృత్యాలు హైలైట్‌గా నిలిచాయి. మమితబైజు, రాధికా శరత్‌కుమార్, రవీనా టాండన్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: జీవీ ప్రకాష్‌కుమార్, బ్యానర్స్: సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్, నిర్మాతలు: సూర్యదేవర నాగవంశీ, సాయిసౌజన్య, రచన–దర్శకత్వం: వెంకీ అట్లూరి.

# సైకలాజికల్ థ్రిల్లర్ 'ది మేజ్'

శ్రీరామ్ హీరోగా నటిస్తున్న సైకలాజికల్ థ్రిల్లర్ 'ది మేజ్'. ప్రియాంక, హ్రితిక శ్రీనివాస్, కమల్ కామరాజు కీలక



పాత్రధారులు. డాక్టర్ రవికిరణ్ గడలాయ్ దర్శకుడు. డా. ఉదయ్ కె. రెడ్డి పాల్వాయి, డాక్టర్ కేఎస్ఆర్(కరెడ్డి శ్రీధర్‌రెడ్డి), డాక్టర్ భరత్‌రెడ్డి గోపు, డాక్టర్ అనిరుధ్‌రెడ్డి సోమ నిర్మాతలు. ప్రస్తుతం సినిమా చిత్రీకరణ దశలో ఉన్నది. ప్రచారంలో భాగంగా శనివారం ఈ సినిమా ఫస్ట్‌లుక్ పోస్టర్‌ని విడుదల చేశారు. ఇంటెన్స్ లుక్‌లో కనిపిస్తున్న లీడ్ యాక్టర్స్‌ని ఈ పోస్టర్‌లో చూడొచ్చు. న్యూ ఏజ్ కమర్షియల్ థ్రిల్లర్‌గా ఈ సినిమా రూపొందుతున్నదని మేకర్స్ తెలిపారు. వాస్తవం, భ్రమ మధ్య ఉన్న సరిహద్దులను చెరిపేస్తూ, ప్రతిక్షణం మీ ఆలోచనలను సవాలు చేసే జెయింట్ వీల్ ప్రయాణం లాంటి ఉత్కంఠభరితమైన సైకలాజికల్ థ్రిల్లర్‌గా ఈ సినిమా ఉంటుందని, చివరి క్షణం వరకూ ఏ జరుగుతుందో ఊహించలేని విధంగా తెరకెక్కుతున్న ఈ సినిమాలో ప్రతి మలుపు ఆసక్తికరంగా ఉంటుందని దర్శకుడు తెలిపారు. ఈ చిత్రానికి సంగీతం: శ్రావణ్ భరద్వాజ్, నిర్మాణం: యూఆర్ క్రియేషన్స్, శ్రౌష కమల ఆర్ట్స్.

### 'టాక్సిక్' నుంచి

# యశ్ కొత్త లుక్

## - కౌంట్‌డౌన్ పోస్టర్ అదిరింది!




'కేజీఎఫ్' సిరీస్‌తో పాన్ ఇండియా స్టార్‌గా ఎదిగిన రాకింగ్ స్టార్ యశ్, తన తదుపరి చిత్రం 'టాక్సిక్'తో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. సినిమా విడుదలకు సరిగ్గా నెల రోజుల సమయం ఉన్న నేపథ్యంలో, చిత్ర బృందం యశ్ ఇంటెన్స్ లుక్‌తో కూడిన ఓ కొత్త పోస్టర్‌ను విడుదల చేసింది. ఈ పోస్టర్ ప్రస్తుతం సోషల్ మీడియాలో ట్రెండింగ్‌లో ఉంది. తాజాగా విడుదలైన ఈ పోస్టర్‌లో యశ్ స్టైలిష్‌గా, అంతే క్రూరంగా కనిపిస్తున్నారు. రక్తంతో తడిసిన చేతులతో, ప్రశాంతంగా సిగరెట్ కాలుస్తూ ఇంటెన్స్ లుక్‌తో ఆకట్టుకుంటున్నారు. ఈ లుక్ సినిమాలోని హింసాత్మక ప్రపంచాన్ని సూచిస్తున్నప్పటికీ, కథపై ఎలాంటి క్లారిటీ ఇవ్వకుండా ఉత్కంఠను పెంచుతోంది. "అతని చేతులకు రక్తం అంటింది" అనే క్యాప్షన్‌తో మేకర్స్ ఈ పోస్టర్‌ను పంచుకున్నారు. 'టాక్సిక్: ఏ ఫెయిరీ టేల్ ఫర్ గ్రోన్–అప్స్' అనే ట్యాగ్‌లైన్‌తో వస్తున్న ఈ చిత్రానికి గీతూ మోహన్‌దాస్ దర్శకత్వం వహిస్తున్నారు. యశ్‌తో కలిసి ఆమె ఈ కథను రాయడం విశేషం. కేవీఎన్ ప్రొడక్షన్స్ నిర్మిస్తున్న ఈ సినిమాను కన్నడ, ఇంగ్లీష్ భాషల్లో ఏకకాలంలో రూపొందించి, పలు భారతీయ భాషల్లోకి డబ్ చేయనున్నారు. యశ్‌తో పాటు నయనతార, కియారా అద్వానీ, తారా సుతారియా, హుమా ఖురేషి వంటి భారీ తారాగణం నటిస్తోంది. కేజీఎఫ్ సిరీస్ వంటి భారీ బ్లాక్‌బస్టర్ల తర్వాత యశ్ నుంచి వస్తున్న సినిమా కావడంతో 'టాక్సిక్'పై అంచనాలు ఆకాశాన్ని అంటాయి. ఈ చిత్రం ఆగస్టు 26న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది.

# సింహాచలానికి 'లక్ష్మీనరసింహ మార్గం'

**రూ.11.70 కోట్లతో 1.4 కి.మీ. రహదారి విస్తరణ పూర్తి**

**గిరిప్రదక్షిణ భక్తులకు మరింత సౌకర్యం.. ఎన్ఎస్టీఎల్**

**-సింహాచలం ప్రయాణానికి కొత్త ఊపు**



విశాఖపట్నం(ప్రశ్న న్యూస్) సింహాచలం శ్రీ వరాహ లక్ష్మీనరసింహ స్వామివారి దర్శనానికి, గిరిప్రదక్షిణకు వచ్చే లక్షలాది మంది భక్తులకు ఇకపై మరింత సౌకర్యవంతమైన ప్రయాణం అందుబాటులోకి రానుంది. ఎన్ఎస్టీఎల్ నుంచి సింహాచలం వరకు జీవీఎంసీ ఆధ్వర్యంలో రూ. 11.70 కోట్ల వ్యయంతో అభివృద్ధి చేసిన రహదారిని లక్ష్మీనరసింహ మార్గం గా నామకరణం చేసి ఆదివారం ఘనంగా ప్రారంభించారు. విశాఖపట్నం పార్లమెంట్ సభ్యుడు ఎం. భరత్, ప్రభుత్వ విప్, పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే పి.జి.వి.ఆర్. నాయుడు (గణబాబు), జిల్లా కలెక్టర్, జీవీఎంసీ స్పెషల్ ఆఫీసర్ ఎం. అభిషిక్త్ కిషోర్, జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ సంయుక్తంగా ఈ రహదారిని ప్రజలకు అంకితం చేశారు. ఈ సందర్భంగా ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ సింహాచలం గిరిప్రదక్షిణ సమయంలో లక్షలాది మంది భక్తులు ఈ మార్గాన్ని వినియోగిస్తారని, వారికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఆధునిక ప్రమాణాలతో రహదారిని విస్తరించామని తెలిపారు. ఈ ప్రాజెక్టు ద్వారా ట్రాఫిక్ రద్దీ గణనీయంగా తగ్గడమే కాకుండా అత్యవసర సేవలు, అంబులెన్స్ రాకపోకలు, ప్రజారవాణా మరింత వేగంగా సాగేందుకు వీలుకల్పించిందన్నారు. ఈ కార్యక్రమంలో జీవీఎంసీ అదనపు కమిషనర్లు, చీఫ్ ఇంజనీర్, ఇంజినీరింగ్ అధికారులు, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు

# మొక్కే మనుగడకు శ్రీరామరక్ష'

**ప్రతి ఇంటా పచ్చదనం పెంచితేనే భావితరాలకు భద్రమైన భవిష్యత్**

**తులసివనం అపార్ట్‌మెంట్స్ ఆధ్వర్యంలో మొక్కల నాటే**

**కార్యక్రమంలో: పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ**



హైదరాబాద్(ప్రశ్న న్యూస్) పర్యావరణ పరిరక్షణ ప్రతి పౌరుడి సామాజిక బాధ్యత అని, మొక్కలు నాటడమే కాకుండా వాటిని సంరక్షించడం కూడా అంతే ముఖ్యమని పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ పేర్కొన్నారు. ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని తులసివనం అపార్ట్‌మెంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన మొక్కల నాటే కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు వెంకటేష్ గౌడ్, ఉప్పలపాటి శ్రీకాంత్ పాల్గొని పచ్చదనం పెంపుదలకు తమ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆరెకపూడి గాంధీ మాట్లాడుతూ, తులసివనం అపార్ట్‌మెంట్స్ నివాసితులు చేపట్టిన ఈ కార్యక్రమం ఇతర కాలనీలకు ఆదర్శంగా నిలుస్తుందని కొనియాడారు. ప్రతి కాలనీ, ప్రతి వీధి, ప్రతి ఇంటి పరిసరాల్లో పచ్చదనం పెరిగేలా అందరూ ముందుకు రావాలని పిలుపునిచ్చారు. "మొక్కే మానవాళి మనుగడకు శ్రీరామరక్ష. సమస్త జీవరాశికి ప్రాణాధారం మొక్కలే. ప్రకృతి సమతుల్యతను కాపాడాలంటే అడవుల విస్తీర్ణం పెరగాలి. అందుకోసం ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా మొక్కలు నాటి వాటిని సంరక్షించాలి" అని ఆయన అన్నారు.

# ప్రభుత్వ బడుల పిల్లలకు ఉచిత సైకిళ్లు

**ఐఐటీ చదువులకు బాటలు**

**రూ.6 కోట్లతో 10 వేల సైకిళ్లు పంపిణీ**



నెల్లూరు( ప్రశ్న న్యూస్) ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పేద విద్యార్థుల భవిష్యత్తుకు బలమైన పునాది వేయాలనే లక్ష్యంతో నెల్లూరులో అరుదైన సేవా కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ కుమార్తె పొంగూరు షరణి ఆధ్వర్యంలో "నారాయణ విద్యా వాహనం" పేరుతో సుమారు రూ.6 కోట్ల స్వంత నిధులతో 10 వేల మంది విద్యార్థులకు ఉచిత సైకిళ్లు పంపిణీ చేయనున్నట్లు ప్రకటించారు. సోమవారం సాయంత్రం వీఆర్సీ గ్రౌండ్‌లో తొలి విడతగా 7 వేల సైకిళ్లను పంపిణీ చేయనుండగా, మిగిలిన 3 వేల సైకిళ్లను దసరా పండుగ సందర్భంగా విద్యార్థులకు అందజేయనున్నట్లు షరణి వెల్లడించారు. నెల్లూరు నియోజకవర్గంలోని 23 ప్రభుత్వ, మున్సిపల్ ఉన్నత పాఠశాలల విద్యార్థులు ఈ పథకం ద్వారా లబ్ధి పొందనున్నారు. కార్యక్రమానికి ముందు చారిత్రాత్మక వీఆర్సీ ప్రభుత్వ పాఠశాలను సందర్శించిన పొంగూరు షరణి విద్యార్థులతో ముచ్చటించి వారి చదువులపై ఆరా తీశారు. అనంతరం స్వయంగా సైకిల్ తొక్కుతూ విద్యార్థుల్లో ఉత్సాహం నింపారు. ఆమెతో కలిసి విద్యార్థులు సందడి చేయడంతో పాఠశాల ఆవరణ సందడిగా మారింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ చిన్నతనంలో ప్రభుత్వ పాఠశాలలకు దూర ప్రాంతాల నుంచి నడుచుకుంటూ వచ్చే విద్యార్థుల కష్టాలను ప్రత్యక్షంగా చూశానని షరణి గుర్తు చేసుకున్నారు. ముఖ్యంగా ఆడపిల్లల భద్రత, ప్రయాణ ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ఈ సైకిళ్ల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో కమిషనర్ నందన్, టీడీపీ నాయకులు జహీర్, బాలాజీ, తిరుమల నాయుడు, మైనుద్దీన్, దర్శి హరికృష్ణ, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

# ఆషాఢ శోభతో ఇంద్రకీలాద్రి కిటకిట

**- సామాన్య భక్తుడే తొలి ప్రాధాన్యం**

**- బోనాలు, సారెలతో పండుగ వాతావరణం**





విజయవాడ (ప్రశ్న న్యూస్) ఆషాఢ మాస ఉత్సవాల వేళ విజయవాడ ఇంద్రకీలాద్రిపై వెలసిన శ్రీ కనకదుర్గమ్మ ఆలయం ఆదివారం భక్తజన సందోహంతో కళకళలాడింది. ఆషాఢ మాసం చివరి ఆదివారం కావడం, తెలంగాణ ప్రాంతం నుంచి బోనాలు, తెలుగు రాష్ట్రాల నలుమూలల నుంచి మహిళలు సారెలతో తరలిరావడంతో కొండంతా ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. తెల్లవారుజామున నుంచే ఘాట్ రోడ్డు, కనకదుర్గ నగర్ మార్గాలు భక్తులతో నిండిపోగా, ఆలయ ప్రాంగణం పండుగ వాతావరణాన్ని తలపించింది. ఈసారి సాధారణ భక్తుల సౌకర్యానికే అత్యున్నత ప్రాధాన్యం ఇవ్వాలని ఆలయ కార్యనిర్వహణాధికారి వి.కె. శీనా నాయక్ కీలక నిర్ణయాలు తీసుకోవడం విశేషంగా నిలిచింది. భక్తుల రద్దీ అనూహ్యంగా పెరగడంతో ఉదయం 7 గంటల నుంచే అంతరాలయ దర్శనాలను నిలిపివేయడంతో పాటు, ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం వరకు అన్ని రకాల ప్రత్యేక దర్శనాలను రద్దు చేసి వాటిని పూర్తిగా ఉచిత దర్శనాలుగా మార్చారు. అంతేకాకుండా ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు అన్ని రకాల వీఐపీ దర్శనాలను కూడా పూర్తిగా నిలిపివేసి, సామాన్య భక్తులకు వేగంగా దర్శనం కల్పించేలా చర్యలు చేపట్టారు. ఆలయ ఈవో వి.కె. శీనా నాయక్ స్వయంగా మహామండపం ఆరో అంతస్తు, క్యూ లైన్లు, దర్శన ఏర్పాట్లను నిరంతరం పర్యవేక్షిస్తూ అధికారులకు తక్షణ సూచనలు అందించారు. ధర్మకర్తల మండలి చైర్మన్ బొర్రా రాధాకృష్ణ (గాంధీ), పాలకమండలి సభ్యులు భక్తులకు అందుతున్న ఉచిత ప్రసాదం, అన్నప్రసాద వితరణను పరిశీలించి ఏర్పాట్లను సమీక్షించారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని నగర పోలీసులు కూడా విస్తృత బందోబస్తు ఏర్పాటు చేశారు. డీసీపీ జి. రామకృష్ణ, ఏసీపీ దుర్గారావు, వన్‌టౌన్ సీఐ గుణ రామ్ నాయకత్వంలో పోలీసులు ట్రాఫిక్ నియంత్రణతో పాటు క్యూ లైన్ల నిర్వహణలో కీలక పాత్ర పోషించారు. ఆలయ డీఈఓ కిషోర్ కుమార్, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ రమాదేవి, అసిస్టెంట్ కమిషనర్ రంగారావు, ఏఈఓలు రమేష్ బాబు, చంద్రశేఖర్ తదితర అధికారులు, ఆలయ సిబ్బంది సమన్వయంతో ఏర్పాట్లు విజయవంతమయ్యాయి. ఆధ్యాత్మిక విశ్వాసం, భక్తుల విశేష స్పందన, సమర్థవంతమైన పరిపాలన కలిసివచ్చిన ఈ ఆషాఢ ఉత్సవాలు ఇంద్రకీలాద్రి చరిత్రలో మరో విశిష్ట అధ్యాయంగా నిలిచాయి. సామాన్య భక్తుడే తొలి ప్రాధాన్యమనే సందేశాన్ని ఆచరణలో చూపిస్తూ ఆలయ యంత్రాంగం తీసుకున్న నిర్ణయాలు భక్తుల ప్రశంసలు అందుకుంటున్నాయి

# ప్రకృతి మాతగా దుర్గమ్మ దివ్య దర్శనం

**ఇంద్రకీలాద్రిపై నేటి నుంచి శాకంబరీ మహోత్సవాలు**

**32 టన్నుల కూరగాయలు, 4 టన్నుల పండ్లతో మహా అలంకారం**

**రైతాంగ శ్రేయస్సు కోసం మూడు రోజుల ప్రత్యేక పూజలు**





విజయవాడ(ప్రశ్న న్యూస్) ప్రకృతి సంపదకు ప్రతీకగా, పాడిపంటల సమృద్ధికి సంకేతంగా నిలిచే శ్రీ కనకదుర్గమ్మ శాకంబరీ మహోత్సవాలకు ఇంద్రకీలాద్రి సిద్ధమైంది. జగన్మాత శ్రీ కనకదుర్గమ్మను కూరగాయలు, ఆకుకూరలు, పండ్లతో అలంకరించి ప్రకృతి స్వరూపిణిగా ఆరాధించే ఈ విశిష్ట ఉత్సవాలు జూలై 27 నుంచి 29 వరకు మూడు రోజుల పాటు అత్యంత వైభవంగా నిర్వహించేందుకు దేవస్థానం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. ఇప్పటికే కొండంతా పచ్చని కాయగూరల దండలు, రంగురంగుల పండ్లతో శోభాయమానంగా మారుతుండగా, భక్తులకు కనుల పండువగా అమ్మవారి దివ్యరూపం దర్శనమివ్వనుంది. ఈ ఉత్సవాలు కేవలం అలంకరణకు మాత్రమే పరిమితం కావు. సకాలంలో వర్షాలు కురవాలని, రైతులు సుభిక్షంగా ఉండాలని, పాడిపంటలు సమృద్ధిగా పండాలని, ప్రజలందరూ ఆయురారోగ్యాలతో జీవించాలని ప్రార్థిస్తూ శాస్త్రోక్తంగా నిర్వహించే ఆధ్యాత్మిక మహోత్సవాలివి. అందుకే ప్రతి ఏడాది ఈ వేడుకలకు ప్రత్యేక ప్రాధాన్యం ఏర్పడుతోంది. ఈ ఏడాది శాకంబరీ ఉత్సవాలు మరో విశేషాన్ని సంతరించుకున్నాయి. 2007లో ప్రారంభమైన ఈ సంప్రదాయం ఇప్పుడు 19వ సంవత్సరంలోకి అడుగుపెట్టింది. అప్పటి ఆలయ కార్యనిర్వహణాధికారి ఎస్.ఎస్. చంద్రశేఖర్ ఆజాద్ ఆధ్వర్యంలో వరంగల్ భద్రకాళీ ఆలయంలో నిర్వహించే శాకంబరీ ఉత్సవాలను అధ్యయనం చేసి, అదే శాస్త్ర సంప్రదాయంతో ఇంద్రకీలాద్రిపై ఈ మహోత్సవాలను ప్రారంభించారు. అప్పటి నుంచి ప్రతి ఆషాఢంలో దుర్గమ్మ ప్రకృతి మాతగా భక్తులకు దర్శనమిస్తూ వస్తున్నారు. ధర్మకర్తల మండలి చైర్మన్ బొర్రా రాధాకృష్ణ (గాంధీ), పాలకమండలి సభ్యులు, అర్చక బృందం, దేవస్థానం అధికారులు, సిబ్బంది సమన్వయంతో ఏర్పాట్లు పూర్తయ్యాయని ఈవో వెల్లడించారు. ప్రకృతి మాతగా కొలువుదీరనున్న శ్రీ కనకదుర్గమ్మను దర్శించి, రైతాంగ శ్రేయస్సు, సకాల వర్షాలు, లోకక్షేమం కోసం జరిగే ఈ పవిత్ర శాకంబరీ మహోత్సవాల్లో భక్తులందరూ పాల్గొని అమ్మవారి అనుగ్రహం పొందాలని ఆయన కోరారు. ఈ మూడు రోజుల పాటు ఇంద్రకీలాద్రిపై ఆధ్యాత్మికత, ప్రకృతి వైభవం, భక్తి పారవశ్యం కలగలిసిన అపూర్వ దృశ్యాలు ఆవిష్కృతం కానుండగా, ప్రకృతిని దైవస్వరూపంగా ఆరాధించే భారతీయ సంస్కృతికి ఈ శాకంబరీ మహోత్సవాలు మరోసారి సజీవ సాక్ష్యంగా నిలవనున్నాయి.

# చిత్తడి నేలల చుట్టూ రక్షణ వలయం

**- డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్**

**- కొండకర్ల ఆవకు 'కన్జర్వేషన్ రిజర్వ్'**

**హోదా దిశగా కీలక అడుగు**






అమరావతి( ప్రశ్న న్యూస్ ) రాష్ట్రంలో చిత్తడి నేలల సంరక్షణకు కూటమి ప్రభుత్వం వేగం పెంచింది. జీవ వైవిధ్యానికి నిలయమైన అనకాపల్లి జిల్లా కొండకర్ల ఆవను 'కన్జర్వేషన్ రిజర్వ్' (పరిరక్షణ నిల్వ)గా ప్రకటించే ప్రక్రియకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. పర్యావరణ పరిరక్షణతో పాటు ఎకో-టూరిజం అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తూనే ప్రజా ప్రయోజనాలకు ఎలాంటి ఆటంకం కలగకుండా చర్యలు చేపట్టాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, అటవీ-పర్యావరణ శాఖ మంత్రి పవన్ కళ్యాణ్ అధికారులను ఆదేశించారు. సుప్రీంకోర్టు మార్గదర్శకాలకు అనుగుణంగా రాష్ట్రవ్యాప్తంగా చిత్తడి నేలల గుర్తింపు, పరిరక్షణ కార్యక్రమాలను వేగవంతం చేయాలని ఆయన స్పష్టం చేశారు. వన్యప్రాణి సంరక్షణ చట్టం-1972 ప్రకారం కొండకర్ల ఆవను కన్జర్వేషన్ రిజర్వ్‌గా ప్రకటించేందుకు అవసరమైన నో అబ్జెక్షన్ సర్టిఫికేట్ (ఎన్ఓసీ) జారీకి ప్రభుత్వం అనుమతి ఇవ్వగా, జలవనరుల శాఖ కూడా అటవీశాఖ ప్రతిపాదనలకు ఆమోదం తెలిపింది. సాగునీరు, జలాశయాల నిర్వహణ, హైడ్రాలిక్ వ్యవస్థలు, ఇతర ప్రజా ప్రయోజన కార్యక్రమాలకు ఎలాంటి భంగం కలగకుండా అవసరమైన రక్షణ చర్యలతోనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రభుత్వం స్పష్టం చేసింది. దీంతో పర్యావరణ పరిరక్షణతో పాటు అభివృద్ధి కార్యక్రమాలు కూడా సమన్వయంతో ముందుకు సాగే అవకాశం ఏర్పడనుంది. ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా శాస్త్రీయ అధ్యయనాలు, క్షేత్రస్థాయి పరిశీలనల ఆధారంగా 950 చిత్తడి నేలలను గుర్తించామని, వాటి నోటిఫికేషన్ ప్రక్రియను వేగవంతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. తొలి దశలో 16 చిత్తడి నేలల నోటిఫికేషన్ ప్రక్రియ తుది దశకు చేరుకుందని వెల్లడించారు. చిత్తడి నేలలు జీవ వైవిధ్యానికి నిలయాలుగా ఉండటమే కాకుండా భూగర్భ జలాల పునరుద్ధరణ, వరదల నియంత్రణ, జల భద్రత, వాతావరణ మార్పుల ప్రభావాన్ని తగ్గించడంలో కీలక పాత్ర పోషిస్తాయని ఆయన పేర్కొన్నారు. స్థానిక ప్రజల జీవనోపాధులకు కూడా ఇవి బలమైన ఆధారంగా నిలుస్తాయని వివరించారు. పర్యావరణ పరిరక్షణ, జీవ వైవిధ్య సంరక్షణ, స్థానిక ఉపాధి, పర్యాటకాభివృద్ధి... ఈ నాలుగు లక్ష్యాలను ఒకే వేదికపైకి తీసుకువచ్చే ప్రయత్నంగా కొండకర్ల ఆవ 'కన్జర్వేషన్ రిజర్వ్' ప్రక్రియ రాష్ట్రంలో చిత్తడి నేలల సంరక్షణకు కొత్త దిశను చూపనుందని అధికారులు భావిస్తున్నారు.

# నేరడి బ్యారేజీకి రూ.641.10 కోట్ల పరిపాలనా అనుమతులు

**సిక్కోలు సాగునీటి కల సాకారానికి కీలక ముందడుగు**





శ్రీకాకుళం(ప్రశ్న న్యూస్) శ్రీకాకుళం జిల్లా రైతాంగం దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న నేరడి బ్యారేజీ నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం కీలక ముందడుగు వేసింది. వంశధార ప్రాజెక్టు ఫేజ్-2లో భాగంగా నేరడి బ్యారేజీతో పాటు అనుబంధ పనులకు రూ. 641.10 కోట్ల పరిపాలనా అనుమతులు మంజూరు చేస్తూ జలవనరుల శాఖ జీవో ఆర్‌టీఎస్ నం. 432ను జారీ చేసింది. ఈ నిధులతో నిర్మాణ పనులతో పాటు భూసేకరణ, పునరావాస కార్యక్రమాలు కూడా చేపట్టనున్నట్లు ప్రభుత్వం ఉత్తర్వుల్లో పేర్కొంది. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఈ నిర్ణయాన్ని చారిత్రాత్మక ఘట్టంగా అభివర్ణించారు. సిక్కోలు రైతుల కలను నిజం చేయాలనే లక్ష్యంతో తాను నిరంతరం కృషి చేశానని తెలిపారు. అంతర్రాష్ట్ర సమస్యలు, ట్రిబ్యునల్ అంశాల పరిష్కారానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సమన్వయం చేసి ప్రాజెక్టుకు మార్గం సుగమం చేసినట్లు చెప్పారు. ఈ నిర్ణయంతో జిల్లాలో వేలాది మంది రైతులకు శాశ్వత సాగునీటి భరోసా లభించనుండగా, వ్యవసాయ ఉత్పత్తి పెరిగి శ్రీకాకుళం జిల్లా ధాన్య భాండాగారంగా ఎదగడానికి ఇది దోహదపడుతుందని స్థానిక రైతులు హర్షం

# మౌలిక వసతుల కల్పనలో విఫలంమైన జీహెచ్ఎంసీ

## -ఎక్కడ చూసిన సమస్యల విలయతాండవం

- గుంతలమయమైన రోడ్లతో ప్రయాణికులకు నరకం
- ఎక్కడ చూసినా ?డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తం
- వర్షం పడితే పొంగిపొర్లుతున్న నాలాలు, మురుగునీరు
- అధికారులు, ప్రజాప్రతినిధులు అలసత్వంతో మందగించిన అభివృద్ధి పనులు
- పలు కాలనీల్లో తాగునీరు, చెత్త నిర్వహణ, పారిశుధ్యంపై నిర్లక్ష్యం
-అస్తవ్యస్తంగా మారిన వీధి దీపాల నిర్వహణ
-నగరాన్ని చుట్టుముట్టిన దోమల బెడద
- జఠిలమవుచున్న నీటి ఎద్దడి




**(ఆర్ కె - ప్రశ్న న్యూస్ బ్యూరో)**

జీహెచ్ఎంసీ అధికారుల నిర్లక్ష్య వైఖరి వల్ల నగరంలో వీధి దీపాలు వెలగక చీకట్లు అలముకున్నాయి. దెబ్బతిన్న రోడ్లు అధ్వానంగా మారాయి. డ్రైనేజీలు పొంగి రోడ్లపై మురుగు నీరు ప్రవహిస్తుంది. తాగునీరు కలుషితమై ప్రజలు అనారోగ్య సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారు. ప్రజాజీవనానికి అవసరమయ్యే మౌలిక సదుపాయాల కల్పనలో జిఏచ్ఎంసీ అధికారులు పూర్తిగా విఫలమయ్యారని పలువురు ఆరోపిస్తున్నారు. ముఖ్యంగా పారిశుద్ధ్యం పనుల నిర్వహణలో నిర్లక్ష్య వైఖరి కారణంగా నగరంలో దోమల బెడద పెరిగిపోవడంతో మలేరియా, డెంగ్యూ, టైఫాయిడ్ వంటి వ్యాధులతో ప్రజలు వణికిపోతున్నను సంబంధిత అధికారులు నిద్రమత్తులో తూగుతు ప్రజా సమస్యలపై హెల్ప్‌లైన్, ఆన్‌లైన్ ద్వారా వచ్చే ఫిర్యాదులపై అలసత్వం ప్రదర్శిస్తు పరిష్కారాన్ని గాలికి వదిలేస్తున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి.

### మరమ్మతులకు నోచుకోని రోడ్లు

సాధారణంగా ప్రజల అవసరాలకు అనుగుణంగా రహదారులను నిర్మించడం, ప్రజలకు ఇబ్బంది కలుగకుండా వాటిని నిర్వహించడం సర్కారు కనీస బాధ్యత. కానీ మన రాష్ట్ర ప్రభుత్వం మాత్రం బాధ్యతను మరిచి అందుకు భిన్నంగా ప్రవర్తిస్తున్నది. నగరంలో రోడ్ల పరిస్థితి చూస్తుంటే అసలు ప్రభుత్వం పనిచేస్తున్నదా అనే అనుమానం కలుగుతున్నది. సాధారణంగా వానకాలంలో పాడైపోయిన రోడ్లకు తాత్కాలిక మరమ్మతులు నిర్వహించి వర్షాలు తగ్గుముఖం పట్టాక శాశ్వత ప్రాతిపదికన పునరుద్ధరించడం ఆనవాయితీ కాని వర్షాకాలానికి ముందే అధ్వాన్నంగా మారిన రహదారుల పరిస్థితి ఇప్పుడు మరింత దయనీయంగా తయారైంది. రోడ్లపై ఏర్పడిన గుంతలతో వాహనదారులు తీవ్ర అవస్థలు ఎదుర్కొనడం కాక వాహనాలు సైతం పాడైపోతున్నాయని దీంతో అనారోగ్య సమస్యలతో పాటు ఆర్థిక ఇబ్బందులు తలెత్తుతున్నాయని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

### దుర్భరంగా మారిన డ్రైనేజీ వ్యవస్థ

ముఖ్యంగా డ్రైనేజీ సమస్యలకు ప్రధాన కారణాలు పూడిక పేరుకు పోవడం, మురుగు నీటి ప్రవాహానికి ప్లాస్టిక్ వ్యర్థాలు అడ్డుపడటం, కాలువలు సరిగ్గా లేకపోవడంతో మురుగునీరు నిలిచిపోయి దుర్వాసన, దోమల బెడదతో అనారోగ్య సమస్యలు తలెత్తుతున్నాయి. వర్షాకాలం కావడంతో కురుస్తున్న చిరుజల్లులకే రోడ్లు చెరువులను తలపిస్తున్నాయి. వర్షాకాలానికి ముందే డ్రైనేజీ వ్యవస్థను పూర్తిస్థాయిలో శుభ్రం చేయాల్సిన అధికారులు నిద్రమత్తులో తూగుతు డ్రైనేజీల్లో పూడికతీత పనులను పూర్తిస్థాయిలో చేపట్టకపోవడంతో మురుగు నీటి ప్రవాహం నిలిచిపోవడంతో దోమలు విజృంభిస్తున్నాయి. దీంతో అనారోగ్య సమస్యలు తలెత్తి మలేరియా, డెంగ్యూ, టైఫాయిడ్, వంటి జ్వరాలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

### చీకట్లు కమ్ముకున్న రహదారులు కాలనీలు

నగరంలో వీధిదీపాల నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. అధికారుల పర్యవేక్షణ లేక పలు ప్రాంతాల్లో సమస్య జఠిలమై వీధుల్లో చీకట్లు కమ్ముకుంటున్నాయి. నిర్వహణను విస్మరించడంతో కొన్ని చోట్ల రోజంతా వెలుగుతుండగా మరికొన్ని ప్రాంతాల్లో రాత్రి వేళ చీకట్లు నెలకొంటున్నాయి. బస్తీలు, కాలనీల్లో అంధకారం నెలకొనడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొత్తగా వీధిదీపాల ఏర్పాటు, నిర్వహణ కోసం లక్షల రూపాయాలు ఖర్చు చేస్తున్న వెలుగులు పంచకపోవడంతో రాత్రివేళ్లలో వాహనదారులు భయం భయంగా రాకపోకలు సాగిస్తున్నారు. అధికారుల నిర్లక్ష్యమే సమస్యకు కారణమని నగరవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అయితే నగరంలోని 30 - 40 శాతం స్ట్రీట్ లైట్లు వెలగడం లేదని, ప్రతి నిత్యం వచ్చే ఫిర్యాదులో అత్యధికంగా వీధిదీపాల సమస్యలు ఉన్నట్లు సమాచారం.

ఇక రాత్రి సమయాల్లో చీకటిగా ఉండటం వల్ల ప్రమాదాల బారిన పడుతున్నామని వాహనదారులు వాపోతున్నారు. వీధిదీపాలు వెలుగడం లేదని, వెలిగినను మసకబారి వెలుగులు విరజిమ్ము లేకపోతున్నాయన్న విషయం ఉన్నతాధికారులకు తెలిసినదే కిందిస్థాయి సిబ్బందిని ముందుకు నడిపించడంలో విఫలమవుతున్నారు. అధికారుల పర్యవేక్షణ లోపం, ప్రజా ప్రతినిధులు బాధ్యతారాహిత్యం వల్ల వీధి దీపాల సమస్య నెలల తరబడి కొనసాగుతుందని ప్రజలు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి వీధి దీపాల సమస్యను పరిష్కరించాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు క్షేత్రస్థాయిలో పర్యటించి అక్కడి పరిస్థితిని పరిశీలించి సమస్య ఎక్కడ ఉందో తెలుసుకుని వాటి పరిష్కారానికి చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది. అలాగే వెలగని పాత లైట్లకు మరమ్మతులు చేయడంతో పాటు అవసరమైన ప్రాంతాల్లో కొత్త దీపాలు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

### తీవ్రంగా మారిన తాగునీటి సమస్య

హైదరాబాద్ మహనగరంలో తాగునీటి సమస్య తీవ్రంగా మారింది. వర్షాభావ పరిస్థితుల దృష్ట్యా రోజు రోజుకు భూగర్భ జలాలు అడుగంటిపోవడం, జలాశయాలలో నీటి మట్టాలు పడిపోవడంతో ట్యాంకర్ల డిమాండ్ విపరీతంగా పెరిగిపోవడం ఆందోళన కలిగిస్తుంది. జూలై మాసం చివరి దశలో కూడా వేసవి ముగిసిందా లేదా అన్న పరిస్థితి నెలకొంది. ఇప్పటి వరకు ఒక్క భారీ వర్షం జాడ లేదు. దీంతో ఇండ్లలో ఉన్న బోర్లు ఎండిపోతున్నాయి. మరోవైపు ఎల్ నినో ప్రభావంతో పరిస్థితి మరింత తీవ్రమయ్యేలా కనిపిస్తున్న నేపథ్యంలో ఇప్పటికే నగర శివారు ప్రాంతాల్లో పరిస్థితి అత్యంత దయనీయంగా మారింది. జలమండలి నుంచి నీటి సరఫరా తగ్గుముఖం పట్టింది. దీంతో ట్యాంకర్లను ఆశ్రయించాల్సి వస్తున్నది. కొన్ని ప్రాంతాల్లో మూడు, నాలుగు రోజులైనా నీరు రావడంలేదు. ఇదే అదనుగా ప్రైవేట్ ట్యాంకర్ల వ్యాపారులు వేలాది ట్యాంకర్లతో నీటిని తోడేస్తు ఇష్టారాజ్యంగా అమ్ముకుంటున్నారు.

మరోవైపు భూగర్భ జలాలు గణనీయంగా పడిపోతున్న వేళ నగరానికి తాగునీరు సరఫరా చేసే ప్రాజెక్టులు ఇప్పటి వరకే నిండు కుండల్లా మారాల్సి ఉండగా, ఎగువన వర్షాలు లేకపోవడంతో వరద రావడం లేదు. దీంతో ఇప్పటికే అన్ని ప్రాజెక్టుల్లో నీటి నిల్వలు డెడ్ స్టోరేజీకి చేరువయ్యాయి. రాష్ట్ర సర్కార్ వెంటనే అప్రమత్తమై ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయకపోతే నగరవాసులకు తాగునీటి కష్టాలు మరింత పెరిగే అవకాశమున్నదని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

### నగరాభివృద్ధికి విడుదలైన బడ్జెట్ ఎక్కడ

ఇటీవల రాష్ట్ర ముఖ్యమంత్రి నగరంలో పర్యటించి పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టి, ఆర్థిక సమస్యలతో రాష్ట్రం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నప్పటికి భారీగా నిధులు మంజూరు చేసినను పనులు మాత్రం ముందుకు సాగడంలేదు. దీనిపై అధికారులు దృష్టి సారించి క్షేత్రస్థాయిలో పరిస్థితులపై సమీక్షించి సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం, సంబంధింత అధికారులు స్పందించి నగర ప్రజల ఆకాంక్షలు తీర్చేలా ప్రణాళికలు సిద్ధం చేసుకోని క్షేత్రస్థాయిలో నీటి సరఫరా, వీధి దీపాల నిర్వహణ, డ్రైనేజీ నిర్వహణ, రోడ్ల మరమ్మతుల పనులు వేగవంతం చేయాలని ప్రజలు కోరుతున్నారు.

## ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ప్రధాన అనుచరుడు

# ఏ.పద్మా రెడ్డి పై కేసు నమోదు

**దళిత మహిళా జర్నలిస్టును దూషించినందుకు అట్రాసిటీ కేసు నమోదు**

**ఎమ్మెల్యే పేరు చెప్పుకొని బెదిరింపుల రాజకీయం.?**

**కల్తీ పనీర్ వ్యవహారాన్ని ప్రశ్నించినందుకే దాడి చేశారా.?**

**అక్రమ దందాలకు అండగా నిలుస్తున్నారనే ఆరోపణలు**

**పూర్తిస్థాయి దర్యాప్తు జరిపి నిజానిజాలు బయటపెట్టాలని ప్రజల డిమాండ్**



కాప్రా(ప్రశ్న న్యూస్) కుషాయిగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో దళిత మహిళా జర్నలిస్టును దూషించడం, బెదిరించడం వ్యవహారం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఈ ఘటనలో ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ప్రధాన అనుచరుడు ఎ.పద్మారెడ్డి పై "ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ" చట్టం కింద కేసు నమోదైనదని బాధితులు తెలిపారు. జర్నలిస్టు విధులు నిర్వహిస్తూ కుషాయిగూడ లోని మురళీకృష్ణ పార్లర్ లో కల్తీ పనీర్ విక్రయాల అంశాన్ని వెలుగులోకి తీసుకురావడానికి ప్రయత్నించగా, ఆమెను లక్ష్యంగా చేసుకొని అత్యంత అసభ్య పదజాలాలతో దుర్భాషలాడటంతో పాటు రిపోర్టర్లను సైతం బెదిరించారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.స్థానికంగా వినిపిస్తున్న ఆరోపణల ప్రకారం, ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ప్రధాన అనుచరుడిగా చెప్పుకునే ఎ. పద్మా రెడ్డి, ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పేరును, అధికారంను అడ్డుపెట్టుకొని అనేక వ్యవహారాల్లో జోక్యం చేసుకుంటున్నారనే ప్రచారం సాగుతోంది. కల్తీ పనీర్ విక్రయాలపై ప్రశ్నించిన మహిళా జర్నలిస్టుపై తీవ్ర స్థాయిలో వ్యక్తిగత దూషణలకు దిగడమే కాకుండా, "రిపోర్టర్ల అంతు చూస్తా" "ముక్కు నేలకు రాయిస్తా" "పిచ్చకుంట్ల రిపోర్టర్లు" అంటూ హెచ్చరికలు చేశారని బాధితులు ఆరోపిస్తున్నారు.ఇదే మొదటిసారి కాదని, గతంలో కూడా ఆయనపై పలు ఆరోపణలు వచ్చినప్పటికీ ఎలాంటి కఠిన చర్యలు తీసుకోలేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. గతంలో ఎమ్మెల్యేగా ఉన్న బేతి సుభాష్ రెడ్డి, ప్రస్తుత ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి ఇలా అధికార పార్టీ నాయకుల పేర్లు వినియోగిస్తూ స్థానికంగా సిసిఎస్(చర్లపల్లి కాలనీల సమైక్య) ని అడ్డుపెట్టుకొని అధ్యక్షుడిగా వ్యవహరిస్తూ ఏ ఉద్యోగం చేయకుండా కేవలం సెటిల్మెంట్లే జీవనోపాధిగా చేసుకొని అక్రమాలకు పాల్పడుతున్నారనే చర్చ ప్రజలలో కొనసాగుతోంది. వాస్తవానికి అక్రమాలకు మధ్యవర్తిగా వ్యవహరించడం వసూళ్లే ధ్యేయంగా పెట్టుకొని జీవించడం జరుగుతుందని, అయితే అవినీతి అక్రమాలను వెలుగులోకి తీసుకువచ్చే జర్నలిస్టులపైన బెదిరింపులకు పాల్పడుతూ వాస్తవాలను వెలుగులోకి తీసుకురాకుండా చేసి ప్రభుత్వ ఆదాయానికి గండి పడేటట్లు చేసిందన్న విమర్శలు ఏ. పద్మా రెడ్డి పై చాలా ఉన్నాయి. ఈ ఘటన జరిగి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసి వారం రోజులు అయిన ఎఫ్ఐఆర్ నమోదు కాలేదు, శనివారం 25 తేదీ నాడు జర్నలిస్టు సంఘాల ఒత్తిడితో కేసు నమోదు అయ్యింది అంటే ఎమ్మెల్యే బిఎల్ఆర్ ప్రభావం పోలీసు అధికారులపై ఎంత తీవ్రస్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు అని జర్నలిస్టు సంఘాలు మండిపడుతున్నాయి.కుషాయిగూడ పరిధిలో అక్రమ నిర్మాణాలు, అనుమతులు లేని షెడ్లు, నిబంధనలకు విరుద్ధంగా బోరింగ్‌లు, ఇతర అక్రమ కార్యకలాపాలకు ఆయన పూర్తిగా సహకరిస్తున్నారనే ఆరోపణలు కూడా స్థానికంగా వినిపిస్తున్నాయి.



ఈ వ్యవహారాల్లో ప్రజాప్రతినిదుల పేరును ఉపయోగించి వసూళ్లు జరిగాయనే అభియోగాలు కూడా ఉన్నాయి. ఈ విషయం తెలిసి ప్రజాప్రతినిధులు కూడా మౌనంగా ఉండడం వెనుక అంతర్యం ఏమిటో అర్థం కాని పరిస్థితి. అధికారులు గతంలో జరిగిన విషయాలపై కూడా సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను బయటపెట్టాల్సిన అవసరం ఉందని స్థానికులు కోరుతున్నారు.ఒక మహిళా జర్నలిస్టు తన వృత్తి ధర్మాన్ని నిర్వర్తిస్తున్న సమయంలో ఆమెపై దుర్భాషలు మాట్లాడటం, బెదిరింపులకు దిగడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని జర్నలిస్టు సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. రాజ్యాంగం కల్పించిన భావ ప్రకటనా స్వేచ్ఛను, పత్రికా స్వేచ్ఛను అవినీతి అక్రమాలు చేసేవాళ్లు అణిచివేసే ప్రయత్నాలను సహించబోమని జర్నలిస్టు సంఘాలు హెచ్చరించాయి. ప్రజాప్రతినిధుల పేర్లు చెప్పుకొని చట్టాన్ని చేతుల్లోకి తీసుకునే ప్రయత్నాలు జరిగితే వాటిపై ప్రభుత్వం, పోలీసు యంత్రాంగం రాజీపడకుండా వ్యవహరించాలని ప్రజలు కోరుతున్నారు. సమాజంలో జరుగుతున్న అనేక అక్రమాలకు రాజకీయ అండ ఉందనే అనుమానాలు తొలగించాలంటే ఆరోపణలపై నిష్పక్షపాత దర్యాప్తు జరిపి, ఎవరైనా తప్పు చేసినట్లు తేలితే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని జర్నలిస్టు సంఘాలు డిమాండ్ చేస్తున్నారు. ఈ ఘటనపై నమోదైన కేసు దర్యాప్తు పారదర్శకంగా సాగి, బాధితురాలికి న్యాయం జరగడంతో పాటు భవిష్యత్తులో జర్నలిస్టులపై బెదిరింపులు, దౌర్జన్యాలకు పాల్పడే వ్యక్తులపై రాష్ట్ర ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని జర్నలిస్టు సంఘాలు కోరుతున్నాయి. ఎంపల్లి పద్మా రెడ్డి పై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసును దళిత మహిళా జర్నలిస్ట్ వాణి ఫిర్యాదు మేరకు నమోదు చేసినట్లు కుషాయిగూడ సిఐ ఎల్ భాస్కర్ రెడ్డి మీడియాకు తెలిపారు

## చిన్న వర్షానికే నీట మునుగుతున్న ప్రధాన రహదారి

- ప్రయాణికుల నరకయాతన
- గజ్వేల్ మున్సిపల్ ఆఫీస్ నుండి ముట్రాజ్‌పల్లి వెళ్లే రహదారిపై నిలిచిన నీరు
- చర్యలు తీసుకోవాలని స్థానికులు, వాహనదారుల డిమాండ్



గజ్వేల్ ( ప్రశ్న న్యూస్ ) సిద్దిపేట జిల్లా గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని అత్యంత కీలకమైన ప్రధాన రహదారిపై డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేకపోవడంతో చిన్నపాటి వర్షం కురిసినా నీరు రోడ్డుపైనే నిలిచిపోతోంది. ముఖ్యంగా గజ్వేల్ మున్సిపల్ కార్యాలయం నుండి ముట్రాజ్‌పల్లి వైపు వెళ్లే మార్గంలో, కోలా అభిరామ్ గార్డెన్ ముందర నుండి సిద్ధార్థ్ సూపర్ మార్కెట్ వరకు రోడ్డు సగం భాగం పూర్తిగా నీటిమయంగా మారుతోంది. దీనివల్ల నిత్యం ఈ మార్గంలో ప్రయాణించే వాహనదారులు, కాలినడకన వెళ్లే పాదచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా రోడ్డులో సగభాగం చెరువును తలపిస్తోంది. రోడ్డుపై మురుగునీరు, వర్షపు నీరు నిలిచిపోవడంతో దుకాణదారులు, వినియోగదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు, ప్రజాప్రతినిధులు వెంటనే స్పందించి కోలా అభిరామ్ గార్డెన్ నుండి సిద్ధార్థ్ సూపర్ మార్కెట్ వరకు సరైన కల్వర్టులు, డ్రైనేజీ కాలువలు నిర్మించి, నీటి నిల్వ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.

## వాన కోసం రైతన్న వెయ్యి కళ్లతో ఎదురుచూపు

**మేఘాలు కమ్ముకున్నా కురవని వాన,**

**ఎండిపోతున్న పంటలతో అన్నదాత ఆందోళన**

**సకాలంలో వర్షాలు లేకపోతే తీవ్ర నష్టం తప్పదంటున్న రైతులు**



కీసర (ప్రశ్న న్యూస్) రాష్ట్రంలోని పలు జిల్లాల్లో రైతులు వర్షాల కోసం ఆశగా ఎదురుచూస్తున్నారు. ఆకాశంలో నల్లని మేఘాలు కమ్ముకున్నప్పటికీ ఆశించిన స్థాయిలో వర్షాలు కురవకపోవడంతో సాగు చేసిన పంటలు ఎండుముఖం పడుతున్నాయి. వాన కోసం రైతులు ఆకాశం వైపు వెయ్యి కళ్లతో ఎదురుచూస్తున్నా ప్రకృతి మాత్రం కరుణ చూపడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఖరీఫ్ సీజన్‌ను దృష్టిలో ఉంచుకుని రైతులు అప్పులు చేసి విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేసి సాగు చేపట్టారు. అయితే వర్షాభావం కారణంగా పొలాల్లో తేమ పూర్తిగా తగ్గిపోవడంతో మొలకెత్తిన పంటలు ఎండిపోతున్నాయి. కొన్ని ప్రాంతాల్లో ఇప్పటికే మళ్లీ విత్తనాలు వేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని రైతులు చెబుతున్నారు.మరోవైపు విద్యుత్ సరఫరా, సాగునీటి సమస్యలు కూడా రైతులను మరింత ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. సకాలంలో మంచి వర్షాలు కురవకపోతే దిగుబడులు తగ్గి తీవ్ర ఆర్థిక నష్టం తప్పదని వ్యవసాయ నిపుణులు హెచ్చరిస్తున్నారు.ప్రభుత్వం వర్షాభావ పరిస్థితులపై ప్రత్యేక దృష్టి సారించి రైతులకు అవసరమైన సహాయం అందించడంతో పాటు పంట నష్టపోయిన వారికి తక్షణమే పరిహారం అందించాలని రైతు సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. ఇప్పటికైనా విస్తారంగా వర్షాలు కురిసి పంటలను కాపాడాలని అన్నదాతలు ఆశగా ఎదురుచూస్తున్నారు.

## ఇది ముగింపు కాదు, ఆరంభం మాత్రమే

**- ముందు ఇంకా పెద్ద ప్రయాణం ఉందన్న అభిజీత్ దీప్కే**



న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన నీట్ పేపర్ లీక్ వ్యవహారంలో కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి విజయం సాధించిన 'కాక్రోచ్ జనతా పార్టీ' (సీజేపీ), 37 రోజుల సుదీర్ఘ నిరసనకు ముగింపు పలికింది. కేంద్ర విద్యాశాఖ మంత్రి పదవికి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయడం, ఆందోళనకారులపై ఎలాంటి చర్యలు తీసుకోబోమని ప్రభుత్వం హామీ ఇవ్వడంతో తాము నిరసనను విరమించుకుంటున్నట్లు ఉద్యమ నేత అభిజీత్ దీప్కే ప్రకటించారు. 30 ఏళ్ల అభిజీత్ నేతృత్వంలో సాగిన ఈ ఉద్యమం, దేశవ్యాప్తంగా అందరి దృష్టిని ఆకర్షించింది. ఆదివారం ఉదయం తన 'ఎక్స్' ఖాతాలో పోస్ట్ చేసిన వీడియో సందేశంలో అభిజీత్ ఎంతో ప్రశాంతంగా మాట్లాడారు. "37 రోజుల తర్వాత ఈ రోజు ప్రశాంతంగా నిద్రపోయాను. రేపు ఏం చేయాలి, సాయంత్రానికి ఏం జరుగుతుందోనన్న ఆందోళన లేకుండా నా బెడ్‌రూమ్‌లో మేల్కొన్నాను. ఇప్పుడు ఎలాంటి భయం లేదు" అని ఆయన తెలిపారు. ఈ 37 రోజుల పోరాటం అత్యంత కఠినంగా గడిచిందని ఆయన గుర్తుచేసుకున్నారు. ఈ విజయం తర్వాత తమ పార్టీ ప్రయాణం ఇక్కడితో ఆగదని, ఇది కేవలం ఆరంభం మాత్రమేనని అభిజీత్ స్పష్టం చేశారు. "కాక్రోచ్ జనతా పార్టీ ఇంకా సుదీర్ఘ ప్రయాణం చేయాల్సి ఉంది" అని ఆయన పేర్కొన్నారు. తమ నిరసనపై ఎన్నో అనుమానాలు వ్యక్తమైనప్పటికీ, తమకు మద్దతుగా నిలిచిన ప్రతి ఒక్కరికీ ఆయన ధన్యవాదాలు తెలిపారు. టైఫాయిడ్ జ్వరంతో బాధపడుతున్నందున, నిన్న జంతర్ మంతర్ వద్ద అందరికీ వ్యక్తిగతంగా కృతజ్ఞతలు చెప్పలేకపోయినందుకు క్షమాపణలు కోరారు. "ఈ దేశం కోసం మీరు చేసిన పోరాటాన్ని నేను ఎప్పటికీ అభినందిస్తాను" అని మద్దతుదారులను ఉద్దేశించి అన్నారు. అదే సమయంలో తమను విమర్శించిన వారికి కూడా ఆయన కృతజ్ఞతలు చెప్పడం విశేషం. "వారు అడిగిన సరైన ప్రశ్నలు, చేసిన విమర్శల వల్లే మేం మరింత మెరుగుపడి మంచి ఫలితాలు సాధించగలిగాం" అని అభిజీత్ అభిప్రాయపడ్డారు. ఈ ఉద్యమ విజయంతో అభిజీత్ దీప్కే, సీజేపీ పేర్లు జాతీయ రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారాయి.

Printed, Published & Owned by "Gouti Bala Sai Tilak" and Published at H.no : 12-13-1282, Flat No : 407, Mehtab Arcade, Tarnaka Main Road, Opp.Ganesh Temple, Secunderabad - 500017, Telangana State. Printed at "Gowrish Offset Printers". H.No : 3-4-353, Barkatpura, Hyderabad-500027. Telangana State. Editor : "Vempati Vijay Kumar". "RNI No: TELTEL/2021/80267". Email : prajaprashna@gmail.com. Cell No : 9494055588